# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శుక్రవారం 3-6-2022 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 243 | పేజీలు:6 | వెల: రూ.1/-


## బండి సంజయ్ దీక్ష ఎవరి కోసమో స్పష్టం చేయాలి : మంత్రులు కేటీఆర్, ఎర్రబెల్లి

హైదరాబాద్, జూన్ 2: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ దీక్ష ఎందుకు చేస్తున్నారు. ఎవరి కోసం చేస్తున్నారో స్పష్టం చేయాలని మంత్రులు కేటీఆర్, ఎర్రబెల్లి దయాకర్ రావు డిమాండ్ చేశారు. గురువారం టెలి కాన్ఫరెన్స్ ద్వారా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జెడ్పీ చైర్మన్లు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు తదితరులతో వారు మాట్లాడారు. బండి సంజయ్ దీక్ష రాష్ట్రానికి నిధులు ఇవ్వని కేంద్రం మీదా? లేక కేంద్రం ఇవ్వకున్నా నిధులు ఇచ్చిన రాష్ట్రం మీదా? అనేది ఆయన తెలపాలని, ఆ తర్వాతే దీక్ష చేయాలని మంత్రులు తెలిపారు. పల్లె ప్రగతి 5 వ విడత కార్యక్రమానికి సమాయత్తంగా ఉండాలన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంపై చూపుతున్న వివక్ష, కక్ష సాధింపు చర్యలను తిప్పికొట్టాలని వారు పిలుపునిచ్చారు. రాష్ట్రానికి రావాల్సిన 15 వ ఫైనాన్స్ కమిషన్ నిధులను కేంద్రం కావాలనే రెండు నెలలుగా రూ.1400 కోట్లు పెండింగ్ లో పెట్టిందని, అయినా రాష్ట్ర ప్రభుత్వం తన వాటాను విడుదల చేసిందన్నారు. కొందరు కావాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్నారని ఆరోపించారు. అన్ని వేదికల్లో, అన్ని స్థాయిల్లో, కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఈ పల్లె ప్రగతి సందర్భంగా ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ప్రజలకు నిజానిజాలు తెలిసే విధంగా కార్యక్రమాలు, సోషల్ మీడియా ను వాడుకోవాలన్నారు.

# అభివృద్ధిలో శిఖరాగ్రానికి తెలంగాణ : సీఎం కేసీఆర్



హైదరాబాద్, జూన్ 2: తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో శిఖరాగ్రానికి చేరిందని రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పబ్లిక్ గార్డెన్‌లో నిర్వహించారు.. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ ప్రజలకు రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. 'ఎనిమిదేళ్ల స్వల్పకాలంలో తెలంగాణ రాష్ట్రం సాధించిన ప్రగతిని విశ్లేషించుకుంటే మనం సాధించిన ఘన విజయాలెన్నో కళ్లముందు సాక్షాత్కరిస్తాయి.

75 సంవత్సరాల్లో దేశంలో ఏ రాష్ట్రం సాధించని విజయాలను 8ఏళ్లలో మన తెలంగాణ రాష్ట్రం సాధించింది. ప్రతి విషయంలో తెలంగాణ రాష్ట్రం అవతరించే నాటికి.. నేటి స్థితిగతులను పోలిస్తే లేదన్నది జగమెరిగిన సత్యం. ఆర్థికవృద్ధిలో, తలసరి ఆదాయం పెరుగుదలలో, విద్యుత్ సరఫరా, తాగు, సాగునీటి సదుపాయం, ప్రజాసంక్షేమం, పారిశ్రామిక, ఐటీ రంగాలతో పాటు అనేక రంగాల్లో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలువడం మనందరికీ గర్వకారణం.

### దేశానికే దిశానిర్దేశం చేసే కర దీపికగా..

అస్థిత్వం కోసం 60 సంవత్సరాలు పోరాడిన తెలంగాణ నేడు అభివృద్ధిలో శిఖరాగ్రానికి చేరి నేడు ప్రపంచం ముందు సగర్వంగా నిలిచింది. ఎనిమిదేళ్ల స్వల్పకాలంలో దేశానికే దిశానిర్దేశం చేసే కరదీపగా మారింది. ప్రజలందరి దీవెన, ప్రభుత్వ సిబ్బంది అంకితభావం వల్లనే ఇదంతా సాధ్యపడిందనేది నిస్సందేహమైన విషయం. కఠిన, పటిష్టమైన ఆర్థిక క్రమశిక్షణతో ఆదాయ వనరులను పెంచుకున్నాం. 2014-2019 వరకు 17.24శాతం సగటు ఆర్థిక వృద్ధిరేటుతో తెలంగాణ దేశంలో అగ్రస్థానంలో నిలిచింది.

ఎన్నో అవరోధాలు ఎదురైనా, కరోనా వంటి విపత్తులు ఎదురవుతున్నా తెలంగాణ రాష్ట్రం ప్రగతి పథంలో దూసుకుపోతున్నది. కరోనా సృష్టించిన సంక్షోభం నుంచి అతిత్వరగా తెలంగాణ కోలుకున్నదని భారత ఆర్థిక సర్వే 2020-21 అభినందించడం.. తెలంగాణ ఆర్థిక నిర్వహణ దక్షతకు దక్కినటువంటి గుర్తింపు. 2013-14లో తెలంగాణ ఏర్పడిననాడు రాష్ట్ర జీఎస్‌డీపీ రూ.5,05,849 కాగా.. 2021-22 నాటికి రూ.11,54,860కోట్లకు చేరింది. పెరిగిన ఆదాయంలో ప్రతి పైసా సద్వినియోగమయ్యే విధంగా ప్రభుత్వం జాగ్రత్తగా ప్రణాళికాబద్ధంగా పెట్టుబడి వ్యయం చేస్తున్నది.

### తలసరి ఆదాయం పెరుగుదలలో తెలంగాణ రికార్డు

తలసరి ఆదాయం పెరుగుదలలో కూడా తెలంగాణ రాష్ట్రం రికార్డు సాధించింది. 2014-15లో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.1,24,124 కాగా.. 2021-22 నాటికి రూ.2,78,833కు పెరిగింది. జాతీయ సగటు ఆదాయమైన రూ.1,49,848 కంటే ఇది 86శాతం అధికం. జాతీయ తలసరి ఆదాయం కంటే తెలంగాణ తలసరి ఆదాయం రోజు రోజుకూ పెరుగుతుండడం శుభపరిణామం.

### వ్యవసాయం దండుగ కాదు.. పండగని నిరూపించాం : సీఎం కేసీఆర్

వ్యవసాయం దండగ కాదు.. పండగ అని నిరూపించామని సీఎం కేసీఆర్ అన్నారు. తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో ఆయన మాట్లాడారు. 'సమైక్య రాష్ట్రంలో ఆనాటి పాలకుల అనాలోచిత, వివక్షాపూరిత విధానాల కారణంగా తెలంగాణ ప్రాంతంలో వ్యవసాయ రంగం కుదేలైపోయింది. సాగునీరు లేదు. బోర్లపై ఆధారపడదామంటే కరెంటు లేదు. పెట్టుబడి లేదు. అప్పులతో, కుటుంబాన్ని పోషించలేక అన్నదాతలు ఆత్మహత్యలకు పాల్పడిన దుస్థితి. ఉద్యమ సమయంలో అనేక ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించిన నాకు ఆనాడు రైతాంగం దుస్థితిని చూసి మనసు వికలమైంది. కృష్ణా, గోదావరి నదులు మన ప్రాంతంగుండా ప్రవహిస్తున్నా సాగునీటికి నోచని రైతుల దుస్థితి చూసి చలించిపోయాను. అందుకే, స్వరాష్ట్ర సాధన అనంతరం వ్యవసాయరంగంపైనా, రైతుల సంక్షేమంపైనా ప్రత్యేక దృష్టిని సారించాను.

### సంక్షేమం, సంస్కరణలతో.. సజల సుజల సస్యశ్యామల తెలంగాణ

రైతు సంక్షేమం కోసం అనేక సంస్కరణలు, పథకాలూ అమలులోకి తేవటంతో నేడు మన రాష్ట్రం 'సజల సుజల సస్యశ్యామల తెలంగాణ' గా మారింది. రైతన్నల రుణభారం తగ్గించడానికి రైతు రుణమాఫీ, 24 గంటల ఉచిత విద్యుత్తు, మిషన్ కాకతీయతో చెరువుల పునరుద్ధరణ, సకాలంలో ఎరువులు, విత్తనాల పంపిణీ, కల్తీ విత్తనాల నియంత్రణ కోసం కఠిన చర్యలు తీసుకోవటం, ప్రతీ 5వేల ఎకరాలను ఒక వ్యవసాయ క్లస్టర్‌గా విభజించి వ్యవసాయ విస్తరణాధికారులను నియమించడం, రైతువేదికల నిర్మాణం, పంటకల్లాల నిర్మాణం, రైతుబంధు సమితిల ఏర్పాటు, పంటకాలంలో పెట్టుబడి సాయం కోసం రైతుబంధు, విధివశాత్తూ అసువులు బాసిన రైతుల కుటుంబాల్ని ఆదుకునేందుకు రైతుబీమా, ప్రాజెక్టులు నిర్మించి సమృద్ధిగా సాగునీరు అందించడం, నీటి తీరువా బకాయిల రద్దు చేయడం, ప్రాజెక్టుల ద్వారా ఉచితంగా సాగునీటి సరఫరా చేయడంద్వారా నేడు వ్యవసాయం దండుగ కాదు, పండుగ అని నిరూపించగలిగాం. 75 ఏళ్ల స్వతంత్ర భారతదేశ చరిత్రలో రూ.50వేల కోట్లు రైతులకు పంట పెట్టుబడిగా అందించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ. దేశంలో మరే రాష్ట్రంలోనూ రైతన్నలకు ఇంతటి సౌకర్యాలు లేనేలేవంటే అతిశయోక్తి కాదు. నేడు ఇతర రాష్ట్రాలు కూడా మన పథకాలను ఆదర్శంగా తీసుకుంటున్నాయి.

### మిషన్ కాకతీయతో చెరువుల పునరుద్ధరణ

తెలంగాణ ప్రాంతంలోని వ్యవసాయరంగానికి శతాబ్దాలుగా ఆదరువుగా ఉన్న గొలుసుకట్టు చెరువులు సమైక్య పాలకుల పాలనలో నిర్లక్ష్యానికి గురై, పూడిపోయి, గట్లు తెగిపోయి, శిథిలావస్థకు చేరుకున్నాయి. తెలంగాణ రాష్ట్ర అవతరణ అనంతరం మిషన్ కాకతీయ పేరుతో పెద్దఎత్తున ఈ చెరువులను పునరుద్ధరించుకున్నాం. 15 లక్షలకుపైగా ఎకరాల సాగుభూమిని స్థిరీకరించుకున్నాం. చెరువుల్లో నీటినిల్వ సామర్థ్యం పెరిగింది. ఈ చెరువులన్నింటికీ సాగునీటి ప్రాజెక్టుల కాలువలతో అనుసంధానం చేసిన ఫలితంగా నేడు నిండు వేసవిలో కూడా చెరువులు జలకళను సంతరించుకున్నాయి. భూగర్భ జలమట్టం పెరిగింది. చెరువులు అభివృద్ధి చెందటంతో చేపల పెంపకం జోరందుకుని, మత్స్యకారులు పెద్ద ఎత్తున లబ్ధి పొందుతున్నారు' అని వివరించారు.

### అప్పుడు సమైక్య పాలకులు.. ఇప్పుడు తెలంగాణపై కేంద్రం వివక్ష : సీఎం కేసీఆర్

ఆంధ్రప్రదేశ్‌లో అంతర్భాగంగా తెలంగాణ ఉన్న సమయంలో సమైక్య పాలకులు వివక్ష చూపారని, స్వరాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతుందని సీఎం కేసీఆర్ ఆరోపించారు. ప్రగతిశీల రాష్ట్రాలకు ప్రత్యేక ప్రోత్సాహం అందించాల్సింది పోయి, నిరుత్సాహం కలిగించేలా కేంద్రం వ్యవహరించడం విచారకరమన్నారు. పబ్లిక్ గార్డెన్స్‌లో తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొని, మాట్లాడారు. ఈ సందర్భంగా కేంద్రం తీరును ఎండగట్టారు. తెలంగాణ ఏర్పడిన తొలినాళ్ల నుంచే వివక్ష ప్రారంభమైందని, రాష్ట్ర ఆవిర్భావ వేడుకలైనా జరుపుకోక ముందే ఖమ్మం జిల్లాలోని ఏడు మండలాలను ఆంధ్రప్రదేశ్‌కు కట్టబెట్టిందని, దీంతో లోయర్ సీలేరు విద్యుత్ ప్రాజెక్టును మనం కోల్పోయామన్నారు.

'దీంతో కేంద్రం అప్రజాస్వామిక వైఖరిని నిరసిస్తూ బంద్ పాటించాల్సి వచ్చింది. ఒక్కమాటలో చెప్పాలంటే, ఆనాటి నుంచి నేటివరకూ మన రాష్ట్ర హక్కుల సాధనకు కేంద్రంతో ఏదో రకంగా పోరాటాన్ని కొనసాగించాల్సి వస్తున్నది. ఐదేళ్లపాటు హైకోర్టు విభజన చేయకుండా కేంద్రం తాత్సారం చేసింది. మన హైకోర్టు మనకు ఏర్పాటైన తర్వాత అవసరమైన సిబ్బందిని, నిధులను, భవనాలను సమర్థవంతంగా సమకూర్చుకున్నాం. రాష్ట్రంలో న్యాయవ్యవస్థ బలోపేతానికి చేసిన కృషికి గౌరవ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఇటీవల ప్రభుత్వాన్ని ప్రశంసించారు' అని తెలిపారు.

### నీతి ఆయోగ్ సిఫారసులూ బేఖాతర్

'మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పథకాలకు రూ.24 వేల కోట్ల నిధులు ఇవ్వాలని నీతి ఆయోగ్ చేసిన సిఫార్సులను కూడా కేంద్రం ఖాతరు చేయలేదు. కొత్త రాష్ట్రానికి అదనపు నిధులు ఇవ్వాలని నేనే స్వయంగా అనేకమార్లు ప్రధాన మంత్రికి విన్నవించినా ప్రయోజనం శూన్యం. కరోనాతో దేశం ఎంతటి ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొన్నదో అందరికీ తెలుసు. ఆ క్లిష్ట సమయంలో కూడా కేంద్రం రాష్ట్రాలకు నయాపైసా అదనంగా ఇవ్వలేదు. పైగా న్యాయంగా రావల్సిన నిధులపై కూడా కోత విధించింది. కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్రంలోని ఆ నాటి 9 ఉమ్మడి జిల్లాలను వెనుకబడిన జిల్లాలుగా ప్రకటించింది. కానీ, ఈ జిల్లాలకు రావాల్సిన నిధులు ఇవ్వడంలో తగని జాప్యం చేస్తోంది. కొత్తగా ఏర్పడిన రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు పన్ను మినహాయింపుతో పాటు ఇతర ప్రోత్సాహకాలు ఇవ్వాలని ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం పేర్కొంది. కానీ, కేంద్రం చెప్పుకోదగ్గ ప్రోత్సాహకాలు ఏవీ ఇవ్వలేదు. విభజన చట్టంలోని హామీలన్నీ బుట్టదాఖలు చేసింది. బయ్యారం స్టీల్ ప్లాంటు, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీల విషయంలో అతీగతీ లేదు' అన్నారు.

### ఐటీఐఆర్ ఏర్పాటు చేయకుండా తీరని అన్యాయం..

'తెలంగాణలో ఐటీఐఆర్ ఏర్పాటు చేయకుండా కేంద్రం తీరని అన్యాయం చేసింది. ఇది అమలుచేసి ఉంటే ఐటీ రంగం మరింతగా పురోగమించి ఉండేది. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాదిమందికి ఉపాధి అవకాశాలు లభించి ఉండేవి. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం రెండు రాష్ట్రాల్లోని నియోజకవర్గాలను డీలిమిట్ చేయాలని స్పష్టంగా పేర్కొన్నది. కానీ, ఇపుడు అధికారంలో ఉన్న కేంద్ర ప్రభుత్వం ఆ ఊసే ఎత్తకుండా కాలయాపన చేయడాన్ని తెలంగాణ ప్రభుత్వం ఖండిస్తున్నది. ఇటీవల యుద్ధం కారణంగా ఉక్రెయిన్‌లో చిక్కుకుపోయిన మన వైద్య విద్యార్థులకు ఎదురైన దుస్థితి మనకు తెలుసు.

వీరంతా మన దేశంలోనే వైద్యవిద్య కొనసాగించే విధంగా ఏర్పాట్లు చేయాలని ప్రధానమంత్రికి నేను స్వయంగా లేఖ రాశాను. మన రాష్ట్ర విద్యార్థుల వైద్యవిద్యకు అయ్యే ఖర్చును భరించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందనీ తెలియజేశాను. కానీ, కేంద్రం నుంచి దీనికి ప్రతిస్పందన రాలేదు. రాష్ట్ర ప్రభుత్వ విన్నపం బధిర శంఖారావంగా మిగిలిపోవడం విషాదం. ఈ విషయంలో కేంద్రం ఉదాసీనతను రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా ఆక్షేపిస్తున్నది' అన్నారు.

### ధాన్యం కొనుగోలులో కేంద్రం వైఫల్యం

'తెలంగాణ రైతాంగం పండించిన పంటను కొనుగోలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం దారుణంగా విఫలమైంది. అసమర్థతతో చేతులెత్తేసింది. తెలంగాణలో రైతులు పండించిన ప్రతి వడ్ల గింజనూ కేంద్రప్రభుత్వం కొనుగోలు చేయాలని నాతో సహా ప్రజాప్రతినిధులందరం కలిసి ధర్నా చేసినం. అయినా ఫలితం లేకపోవడంతో శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులు, పార్లమెంటు సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులతో కలసి ఢిల్లీలో ఒకరోజు జరిపిన నిరశన దీక్షలో నేను స్వయంగా పాల్గొన్నాను. భారతీయ కిసాన్ యూనియన్ నేత రాకేశ్ టికాయత్ కూడా మనకు మద్దతుగా ఈ దీక్షలో పాల్గొన్నారు. ధాన్యం సేకరణపై 24 గంటల్లో ఓ నిర్ణయం తీసుకోవాలని కేంద్రాన్ని డిమాండ్ చేస్తే సానుకూలంగా జవాబు రాలేదు. స్పందన లేదు' అన్నారు.

### నూకలు తినాలని కేంద్రమంత్రి అవహేళనగా మాట్లాడింది..

'తెలంగాణ ప్రజలు నూకలు తినాలని ఓ కేంద్రమంత్రి అవహేళనగా మాట్లాడింది. ఇంతకన్నా దురహంకారం మరేమైనా ఉంటుందా? ఈ వ్యాఖ్యలు తెలంగాణ ప్రజల హృదయాలను తీవ్రంగా గాయపరిచాయి' అని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో రైతులు భిక్షగాళ్లు కాదు. దేశవ్యాప్తంగా ధాన్యం కొనుగోలుకు ఒకే విధానం ఉండాలి. లేకపోతే రైతులు రోడ్లపైకి వస్తారు. ఎవరితోనైనా పెట్టుకోండి కానీ, రైతులతో పెట్టుకోవద్దని కేంద్ర ప్రభుత్వాన్ని మరోసారి హెచ్చరిస్తున్నాను. కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ, రైతులతో చెలగాటమాడే ధోరణిని ఇకనైనా మానుకోవాలని డిమాండ్ చేస్తున్నాను.

కేంద్రం మొండి చెయ్యి చూపినా మన రైతాంగాన్ని ఆదుకోవడం, వారి పంటలకు గిట్టుబాటు ధరలు లభించేలా చూడటం విద్యుక్త ధర్మంగా భావించి, రైతు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వమే నడుం బిగించింది. ధాన్యం దిగుబడి, కొనుగోళ్లలో తెలంగాణ రాష్ట్రం కనీవినీ ఎరుగని ప్రగతిని సాధించింది. కేంద్రం సహకరించినా, సహకరించకున్నా రైతన్నలకు రాష్ట్ర ప్రభుత్వం ఇదే విధంగా పూర్తి అండదండలు అందిస్తుందని మరోసారి నేను భరోసా ఇస్తున్నాను' అన్నారు.

### రాష్ట్రాలను కేంద్రం బలహీనపరుస్తోంది..

'ప్రపంచ దేశాలు అనేక సంఘర్షణలు, పోరాటాల పర్యవసానంగా రాచరిక, నియంతృత్వ దశలను అధిగమించి ప్రజాస్వామ్య దశకు చేరుకున్నాయి. అత్యధిక దేశాలు ప్రాతినిధ్య ప్రజాస్వామ్య ప్రక్రియను అవలంబిస్తూ, పార్లమెంటరీ పంథాను ఎంచుకున్నాయి. పరిణామ క్రమంలో ప్రజాస్వామ్యం పరిణతి చెందేకొద్దీ ఆయా దేశాలు అధికారాలను వికేంద్రీకరిస్తూ ప్రజా సాధికారికతను పెంపొందించాయి. పౌర సమాజ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేశాయి. కానీ, మన దేశంలో అందుకు విరుద్ధంగా జరిగింది. 75 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానం తర్వాత దేశంలో ప్రజాస్వామ్యం పరిణతిని పొంది అధికారాల వికేంద్రీకరణ జరగకపోగా, నిరంకుశ పోకడలు పెరిగి అధికారాలు మరింత కేంద్రీకృతమవుతున్నాయి.

విశాలతరం కావల్సిన సమాఖ్య స్ఫూర్తి కుంచించుకు పోతున్నది. భారత రాజ్యాంగం రాష్ట్రాలకు గణనీయమైన రాజకీయ, శాసనాధికారాలను, పాలనాధికారాలను, స్వయంప్రతిపత్తిని కల్పించింది. ఇప్పటివరకూ కేంద్రంలో గద్దెనెక్కిన ప్రభుత్వాలన్నీ, రాజ్యాంగ స్ఫూర్తిని మంటగలుపుతూ రాష్ట్రాల స్వయంప్రతిపత్తిని కాలరాశాయి. అధికారాలను నిస్సిగ్గుగా హరించాయి. భారత రాజ్యాంగంలోని ఏడవ షెడ్యూల్ కేంద్రం పరిధిలోని అధికారాలనూ, రాష్ట్రాల పరిధిలోని అధికారాలనూ స్పష్టంగా నిర్వచించింది. కేంద్ర జాబితా, రాష్ట్ర జాబితా, ఉమ్మడి జాబితా అనే మూడు జాబితాలను నిర్దేశించింది.

### కమిషన్ల నివేదికలు బుట్టదాఖలు..

'దేశాన్ని పాలించిన అన్ని ప్రభుత్వాలూ రాష్ట్ర జాబితాలోని వివిధ అంశాలను క్రమంగా ఉమ్మడి జాబితాలోకి లాగేసుకున్నాయి. కాలం గడుస్తున్నకొద్దీ ఉమ్మడి జాబితా పెరుగుతున్నది. రాష్ట్ర జాబితా తరుగుతున్నది. రాజ్యాంగం పేర్కొన్న రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి నామావశిష్టమైపోతున్నది. గతంలో

కేంద్ర ప్రభుత్వాలే ఏర్పాటు చేసిన సర్కారియా, పూంఛ్ కమిషన్లు రాష్ట్రాల హక్కులను పరిరక్షించేందుకు పలు సూచనలు చేశాయి. కానీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన అన్ని ప్రభుత్వాలూ ఈ కమిషన్ల నివేదికలను బుట్ట దాఖలు చేశాయి.

ఇప్పటి వరకూ దేశాన్ని ఏలిన ఈ ప్రభుత్వాలు అనుసరించిన ధోరణులు ప్రజాస్వామ్య వ్యవస్థకు ఏరకంగానూ మంచి చేయజాలకపోగా, దేశ ప్రజలు ఆశిస్తున్న అభివృద్ధికి, వికాసానికి తీవ్ర అవరోధాలుగా మారాయి. ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం 'బలమైన కేంద్రం - బలహీనమైన రాష్ట్రాలు' అనే కుట్రపూరితమైన, పనికిమాలిన సిద్ధాంతాన్ని ప్రాతిపదికగా చేసుకొన్నది. అందుకే ఈ ప్రభుత్వ హయాంలో రాష్ట్రాల హక్కుల హననం పరాకాష్ఠకు చేరుకున్నది. కూచున్న కొమ్మను నరుక్కున్నట్టుగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను ఆర్థికంగా బలహీనపరిచే కుతంత్రాలకు పాల్పడుతున్నది.

## పబ్లిక్ గార్డెన్స్‌లో జాతీయ జెండా ఎగురవేసిన సీఎం కేసీఆర్



హైదరాబాద్, జూన్ 2:పబ్లిక్ గార్డెన్స్‌లో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ప్రారంభమయ్యాయి. సీఎం కేసీఆర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అంతకుముందు గన్‌పార్కులో అమరవీరులకు నివాళు లర్పించారు.

రాష్ట్ర అవతరణ వేడుకలు ప్రగతి భవన్‌లో ఘనంగా జరిగాయి. ప్రగతి భవన్ ఆవరణలో సీఎం కేసీఆర్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. జాతీయ గీతం ఆలపించారు. అనంతరం మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు సంతోష్ కుమార్, దీవకొండ దామోదర్ రావు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, వివేకానంద, సీఎస్ సోమేశ్ కుమార్, డీజీపీ మహేందర్ రెడ్డి, ప్రగతి భవన్ సిబ్బంది పాల్గొన్నారు.

## సంక్షేమంలో తెలంగాణే ఆదర్శం : స్పీకర్ పోచారం



కామారెడ్డి , జూన్ 2: సంక్షేమంలో ఇతర రాష్ట్రాల కన్నా తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర శాసన సభా పతి పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సంక్షేమ పథకాలు అమలు చేయడంలో ఇతర రాష్ట్రాల కంటే మన రాష్ట్రం ముందుందని తెలిపారు.

కళ్యాణ లక్ష్మి, రైతుబంధు, భీమ, రాయితీపై గొర్రెల పంపిణీ, మత్స్యకారులకు చేప పిల్లల పంపిణీ, ఆరోగ్యశ్రీ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందని పేర్కొన్నారు. రైతులు పంటల మార్పిడి పద్ధతులను అవలంబించాలని సూచించారు. ఆయిల్ ఫామ్ సాగు వైపు రైతులు దృష్టిని సారించాలని పేర్కొన్నారు.

పార్టీలకతీతంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అన్ని వర్గాల ప్రజలకు అందజేస్తోందని వివరించారు. ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నదని గుర్తు చేశారు. అంతకుముందు శాసనసభాపతి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అమరవీరుల స్తూపం వద్ద అమరవీరులకు నివాళు లు అర్పించారు.

జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనుల నివేదికను వివరించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, జెడ్పి చైర్ పర్సన్ శోభ, ఎమ్మెల్యేలు సురేందర్, హనుమంత్ షిండే, ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, అదనపు కలెక్టర్లు చంద్రమోహన్, వెంకటేష్ ధోత్రే, ఆర్డీవో వాణి, ఆర్ డి ఓ శ్రీను, వివిధ అ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## చరిత్రలో నేటినిజం



కం॥ జయముల నాయకుడై-శస
మయమున కార్యములు జేయు మంత్రివరుండై
లయమున చెలగి-పద్యము
ప్రియము న ఆశయుంతు 'జార్జి ఫెర్నాండెజ్'పై!!

-రాధశ్రీ



(జూన్ 3 జార్జి ఫెర్నాండెజ్ జన్మదినం..) సెల్: 9494481210

# జిల్లా కోర్టుల ప్రారంభం సంతోషంగా ఉంది : సీఎం కేసీఆర్

హైదరాబాద్, జూన్ 2:రాష్ట్రావతరణ దినోత్సవం సందర్భంగా జిల్లా కోర్టులను ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొన్నారు. రాష్ట్రంలో జ్యుడీషియల్ డిపార్ట్‌మెంట్‌లో ఎలాంటి ఇబ్బందుల్లేకుండా పూర్తిస్థాయిలో సహకారం అందించేందుకు ప్రభుత్వం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందన్నారు. హైకోర్టు ప్రాంగణం నుంచి 23 కొత్త జిల్లాల కోర్టులను వర్చువల్ విధానంలో సీఎం కేసీఆర్‌తో కలిసి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిన్ ఎన్వీ రమణ ప్రారంభించారు.

ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. ఈ రోజు చాలా మంచి దినం. మీ అందరికీ కూడా హృదయపూర్వకంగా రాష్ట్రావతరణ దినోత్సవ శుభాకాంక్షలు. గతంలో ఒకసారి తెలంగాణ హైకోర్టు ప్రారంభోత్సవానికి వచ్చాను. ఇప్పుడు మళ్లీ 33 జ్యుడీషియల్ జిల్లాల వ్యవస్థ ప్రారంభోత్సవం సందర్భంగా ఇక్కడికి రావడం సంతోషంగా ఉంది. అన్ని రంగాల్లో తెలంగాణ పురోగమనంలో ఉంది. చాలా అంశాల్లో తెలంగాణ అగ్రస్థానంలో ఉంది. రాష్ట్రం ఉజ్వలంగా దేదీప్యమానంగా దూసుకుపోతోంది. ఎన్వీ రమణ ఇదే హైకోర్టులో పని చేసినటువంటి ఈ గడ్డబిడ్డ. వారు ఎంతో పెద్ద మనసుతో కేంద్రంతో మాట్లాడి మన హైకోర్టు జడ్జిల సంఖ్యను పెంచారు. వెంటనే నియామకాలు చేపట్టి, ఒక పటిష్టమైన కోర్టుగా రూపుదిద్దుకున్నాం.

లోయర్ జ్యుడీషియరీలో పటిష్టత కోసం ఇటీవలి కాలంలో న్యాయశాఖ అధికారులతో మే సుదీర్ఘమైన భేటీ నిర్వహించి కొన్ని నిర్ణయాలు తీసుకున్నాం. జిల్లా కోర్టులు కావాలని కోరిన వెంటనే సీజే అంగీకరించి.. ఏర్పాటు చేశారు. ఇవాళ జిల్లా కోర్టులను ప్రారంభించుకోవడం మనందరికీ గర్వకారణం. సెషన్స్ కోర్టులకు వెళ్లేందుకు ప్రజలు చాలా ఇబ్బందులు పడేవారు. ఇలాంటి సమస్యలను దృష్టిలో ఉంచుకుని పరిపాలనలో సంస్కరణలను అమలు చేశాం. కొత్త జిల్లాలను ఏర్పాటు చేసుకున్నాం. పరిపాలన వికేంద్రీకరణ ద్వారా ఎన్నో సత్ఫలితాలను సాధించాం. పటిష్టమైన జ్యుడీషియరీ ఏర్పాటు కావాలని సీజేను కోరాం. ఆయన వెంటనే మంజూరు చేసి ముందుకు వెళ్తున్నారు. ఈ కోర్టులకు కావాల్సిన సిబ్బందిని మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. సిటి సివిల్ కోర్టులు, రంగారెడ్డి కోర్టు చాలా ఓవర్ లోడెడ్‌గా ఉన్నట్టు సమాచారం అందింది. వీటిని కూడా విభజించాలని అనుకుంటున్నాం. దీనికి సంబంధించిన ప్రతిపాదనలు పంపిస్తే ప్రభుత్వం వెంటనే మంజూరు చేస్తుందన్నారు. దీంతో ప్రజలకు సత్వర న్యాయం జరిగే అవకాశం ఉందని కేసీఆర్ పేర్కొన్నారు.





## నిఖత్ జరీన్, ఇషాసింగ్‌ను ఘనంగా సత్కరించిన సీఎం కేసీఆర్



హైదరాబాద్, జూన్ 2:తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను పబ్లిక్ గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ఖ్యాతిని ప్రపంచ నలుదిశలా వ్యాపింపజేసిన కిన్నెరమెట్ల వాయిద్యకారుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత దర్శనం మొగులయ్య, అంతర్జాతీయ క్రీడల్లో స్వర్ణ పతకాలు సాధించిన క్రీడాకారులు నిఖత్ జరీన్, ఈషాసింగ్‌ను సీఎం కేసీఆర్ సమున్నత రీతిలో సత్కరించారు. మొగులయ్యకు రూ.కోటి చెక్ అందజేశారు. క్రీడాకారులు నిఖత్ జరీన్, ఈషాసింగ్‌కు రూ.2 కోట్ల చొప్పున చెక్కులను అందించారు.

అంతర్జాతీయ వేదికలపై పసిడి పతకాలతో మువ్వన్నెల పతాకాన్ని రెపరెపలాడించిన ఇద్దరు క్రీడాకారులకు నగదు ప్రోత్సాహంతో పాటు జూబ్లీహిల్స్ లేదా బంజారాహిల్స్‌లో నివాస స్థలాలు ప్రభుత్వం ఇవ్వనుంది.

## తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలలో పాల్గొన్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



మెదక్, జూన్ 2 (నేటి నిజం ప్రతినిధి) మెదక్ జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలలో ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ పతాకావిష్కరణ గావించి జిల్లా ప్రజలను ఉద్దేశించి రాష్ట్ర పశువైద్య,పశు సంవర్ధక ,పాఢిపరిశ్రమ శాఖ మంత్రివర్యులు శ్రీ తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రసంగించారు. అంతకుముందు మంత్రి చిన్నశంకరంపేట లో అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి నివాళు లరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పరిషద్ చైర్ పర్సన్ హేమలత శేఖర్ గౌడ్, జిల్లా కలెక్టర్ ఎస్.హరీష్, ఎస్పీ రోహిణి ప్రియదర్శిని, అడిషనల్ ఎస్పీ బాలస్వామి, అదనపు కలెక్టర్లు ప్రతిమ సింగ్, రమేష్, ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి, మునిసిపల్ చైర్మన్ చంద్ర పాల్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్ర గౌడ్, మునిసిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తొలి పోషకాహారం క్షీరమే

## ( 'ప్రపంచ క్షీర దినం' సందర్భంగా)

అమ్మ అందించే తొలి అమృత సంపూర్ణ పోషకాహారమైన పాలతోనే మన జీవితం ప్రారంభం అవుతుంది. అన్ని వయస్సుల వారికి ఆరోగ్యాన్ని ప్రసాదించే సమతుల చవకైన ద్రవ ఆహారంగా పాలకు ప్రథమ స్థానం ఉన్నది. ప్రపంచ దేశాల్లో మన భారతదేశం పాల ఉత్పత్తిలో ముందు వరసలో ఉన్నది. ప్రతి రోజు 150 మిలియన్ లీటర్ల ఉత్పత్తితో రోజుకు తలసరి 300 గ్రామ్‌ల పాలు అందుబాటులో ఉంటున్నాయి. ఆరోగ్య పరిరక్షణలో పాల ప్రాధాన్యతను గుర్తించిన ఐరాస అనుబంధ సంస్థ 'ఆహార మరియు వ్యవసాయ సంస్థ (ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్)' ప్రతి ఏటా 01 జూన్ రోజుల 'ప్రపంచ క్షీర దినం' పాటించాలని 2001లో తీర్మానించింది. పాలు మరియు పాల ఉత్పత్తుల్లో దాగిఉన్న అపూర్వ పోషకాలు నవజాత శిశువుతో మె?దలు నిండు ముసలి శారీరక-మానసిక ఆరోగ్య రక్షణకు ఉపకరిస్తుందనే అవగాహనను ప్రజల్లో పెంపొందించడం, పాల ఉత్పత్తులను పెంచే అవసరాలను వివరించడం, పలు రకాల పాల ఉత్పత్తులను ప్రోత్సహించడం, పాడి పరిశ్రమలను నెలకొల్పడం లాంటి అంశాలన్నింటిని చర్చించే వేదికగా 'ప్రపంచ క్షీర దినం' నిర్వహించుట జరుగుతున్నది. ప్రపంచవ్యాప్తంగా కనీసం ఒక బిలియన్ ప్రజలకు పాలే జీవనాధారంగా నిలుస్తున్నది. ప్రపంచ క్షీర దినం-2022 నినాదంగా 'డయరీ నెట్ జీరో' అనబడే పర్యావరణ కార్బన్ రహిత కాలుష్య అంశాన్ని తీసుకున్నారు.

పాడి పరిశ్రమ:

ప్రపంచ ఆహార వ్యవస్థలో అగ్రభాగాన పాలు, పాల ఉత్రత్తులు వస్తాయి. కుటుంబాలకు ఆర్థిక వనరుగా, పోషకాహారం అందించే స్వేతవర్ణ ద్రవంగా, వ్యవసాయ అనుబంధ పరిశ్రమగా పాల ఉత్పత్తులు అనాదిగా మానవ జీవితాలతో అనుబంధాన్ని పెనవేసుకున్నాయి. కరోనా మహమ్మారి కల్లోల కాలంలో వ్యాధి నిరోధకశక్తిని పెంచుకోవడానికి అత్యవసరమైన ఆహారంగా పాలను వినియోగించాం. శిశు జనన శుభ గడియల్లో అమ్మ రొమ్ము ప్రసాదించే ముర్రు పాలతో ప్రారంభమయ్యే జీవితం, కడదాక సాదు జంతువుల పాలు లేదా పాల ఉత్పత్తులు లేకుండా రోజు గడవని స్థితిలో మనం ఉన్నాం. ఆవులు, మేకలు, బర్రెలు, గొర్రెల లాంటి సాదు జంతువులు పాలకు ప్రధాన వనరులుగా మన జీవితాలతో పెనవేసుకొని ఉన్నాయి. పాల ఉత్పత్తుల్లో పెరుగు, మజ్జిగ, వెన్న, నెయ్యి, క్రీమ్, కస్టర్డ్, ఐస్ క్రీమ్, మీగడ లాంటివి అనేకం వస్తాయి. ఇండియాలో 'శ్వేత విప్లవ పితామహుడు' డా: వర్గీస్ కురియన్ జన్మదినం 26 నవంబర్ రోజున 'జాతీయ పాల దినం' జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది.

పాలలో పోషక విలువలు:

బహుముఖీన పోషక విలువలు కలిగిన ఏకైక ఆహారం పాలు మాత్రమే అని మనందరికీ తెలుసు. అత్యుత్తమ పోషకాహారంగా పాలు, పాల ఉత్పత్తులు మనవాళి ఆరోగ్య ప్రదాతలుగా దీవిస్తున్నాయి. పాలలో విటమిన్లు, మాంసకృత్తులు, పీచు పదార్థాలు, చక్కెరలు, కొవ్వులు, ఖనిజ లవణాలు సమృద్ధిగా ఉన్నాయి. ఒక కప్పు పాలలో 8 గ్రామ్‌ల ప్రోటీన్ లభిస్తుంది. దీని ద్వారా శరీర ఎదుగుదల, కణజాల మరమ్మత్తులు, వ్యాధి నిరోధక శక్తిని పెంచడం, చర్మ ఆరోగ్యం లాంటి ప్రయోజనాలు కలుగుతాయి. ఎముకల పటిష్టత, పెరుగుదలకు అవసరమైన కాల్షియం, ఫాస్ఫరస్, పొటాషియం పోషకాలను అందిస్తుంది. కాఫీ, టీ, ఓట్‌మీల్, సూప్స్, సేమియా, పండ్ల రసాల లాంటి అనేక ఆహార పదార్థాల తయారీలో పాలను వినియోగిస్తారు. పాడి పరిశ్రమ జీవనోపాధిగా, వ్యవసాయ అనుబంధ ఆర్థిక వెసులుబాటుగా, ఆరోగ్య ప్రదాతగా, సంపూర్ణ పోషకాహార అమృత ద్రవంగా, అత్యంత రుచిగల మిఠాయిలుగా పలు సేవలకు పుణాదిని అందిస్తున్నది. పాల లాంటి తెల్లని మనసు కలిగి, పాలను, పాల ఉత్పత్తులను మన ఆహారంలో భాగం చేసుకుంటూ, ఆరోగ్యమే మహా భాగ్యమని తలుస్తూ, ఆరోగ్య భారతాన్ని ఆవిష్కరిద్దాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## జిల్లా వ్యాప్తంగా పలు ప్రధాన కూడళ్ళలో, హైవే రోడ్డులపై అత్యాధునిక సిసి కెమెరాలతో నిఘా....!

### -జిల్లా ఎస్పీ యం. రమణ కుమార్.



సంగారెడ్డి, జూన్ 2: (నేటినిజం ప్రతినిధి): జిల్లాలో ట్రాఫిక్ ఉల్లంఘన కేసులు పెరుగుతున్నందున, రోడ్డు ప్రమాదాలను నివారించాలనే ఉద్దేశ్యంతో అనేకరకాల అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుంది. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా పలు ప్రధాన కూడళ్ళలో, హైవే రోడ్డులపై అత్యాధునిక సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కెమెరాల ద్వారా ట్రాఫిక్ నిభందనల ఉల్లంఘనకు పాల్పడిన వారి ఫోటో తీసి జరిమాన విధించడం జరుగుతుంది. కావున వాహనదారులందరూ విధిగా హెల్మెట్స్, సీట్ బెల్ట్ ధరించాలన్నారు. ట్రాఫిక్ నిభందనల గురించి అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండి, నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. మన ప్రయాణం ఎదుటి వారికి ఇబ్బంది కలగకుండా సురక్షిత ప్రయాణం చేసి గమ్యాలను చేరుకోవాలన్నారు. ట్రాఫిక్ నిభందనల ఉల్లంఘనకు పాల్పడితే చట్టరిత్యా చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలియజేశారు.

## జిల్లాలో 30, 30(ఎ) పోలీసు యాక్ట్ అమలు

### - జిల్లా ఎస్పీ యం.రమణ కుమార్

సంగారెడ్డి, జూన్ 2: (నేటినిజం ప్రతినిధి):జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని నెల రోజులు(జూన్ 1వ తేది నుండి 30 వరకు) జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీసు యాక్ట్-1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ యం.రమణ కుమార్ తెలిపారు. కావున పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేనిది సంగారెడ్డి జిల్లా ప్రజలు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలిలు, పబ్లిక్ మీటింగ్ లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని, ప్రజా ధనానికి నష్టం కల్గించే, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టరాదని యస్.పి. గారు తెలియజేసారు. కావున జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు ఇట్టి విషయంలో పోలీసు వారికి సహకరించాలన్నారు.

అనుమతి లేకుండా పై చర్యలకు పాల్పడితే సంబందిత వ్యక్తులపై చట్టరిత్య కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## ఆత్మకూరు వైసీపీ అభ్యర్థిగా మేకపాటి విక్రమ్ రెడ్డి నామినేషన్



అమరావతి, జూన్ 2:ఏపీ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రిగా పనిచేసిన మేకపాటి గౌతం రెడ్డి ఆకస్మిక మరణంతో ఖాళీ అయిన నెల్లూరు జిల్లా ఆత్మకూరు స్థానాన్ని సోదరుడు విక్రమ్‌రెడ్డికి వైసీపీ అధిష్టానం పోటీకి అవకాశం కల్పించింది. దీంతో ఈరోజు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్‌రెడ్డి, వైసీపీ నాయకులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి తదితరుల సమక్షంలో వైసీపీ అభ్యర్థిగా మేకపాటి విక్రమ్‌రెడ్డి నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా అభ్యర్థి విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ.. తాను ఈ ఉప ఎన్నికల్లో లక్ష మెజారిటీతో విజయం సాధిస్తానని ధీమాను వ్యక్తం చేశారు.


ఆహ్వానం
కిన్నెర ఆర్ట్ థియేటర్స్
వాసా ఫౌండేషన్



ప్రముఖ రచయిత్రి
డా॥ వాసా ప్రభావతి శాస్త్రి జయంతి సందర్భంగా
ప్రముఖ రచయిత్రి డా॥ ముక్తేవి భారతి గారికి
డా॥ వాసా ప్రభావతి జీవిత సాఫల్య గురు పురస్కారం
ప్రముఖ సాహితీ వేత్త శ్రీ శలాక రఘునాథ శర్మ గారికి
డా॥ వాసా ప్రభావతి జీవిత సాఫల్య సాహితీ పురస్కారం - బహూకరణ
తేది: సోమవారం 6 జూన్, 2022 సా॥ 6 గంటలకు
శ్రీ త్యాగరాయగానసభ, చిక్కడపల్లి, హైదరాబాద్

ముఖ్యఅతిథి : డా॥ కె.వి. రమణ ఐ.ఎ.ఎస్. (రి) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు
సభాప్రారంభం : శ్రీమతి యం. శైలజాసుమన్, విశ్రాంత డిప్యూటి డైరెక్టర్ జనరల్, ఆకాశవాణి
అధ్యక్షులు : డా॥ వోలేటి పార్వతీశం, ప్రముఖ సాహితీ వేత్త
గౌరవ అతిథి : శ్రీమతి శైలజమిత్ర, ప్రముఖ రచయిత్రి
ఆత్మీయ అతిథులు : శ్రీ గుడిపాటి వెంకటేశ్వర్లు, సంపాదకులు, పాలపిట్ట
శ్రీ పొత్తూరి సుబ్బారావు, సంపాదకులు, సాహితీ కిరణం

డా॥ వాసా ప్రభావతి స్మారక కవితల, కథల పోటీల విజేతలకు బహుమతి ప్రదానం
సాంస్కృతిక కార్యక్రమం : వాసా ప్రభావతి లలిత గీతాల విభావరి
సంగీత దర్శకత్వం : శ్రీ విన్నకోట మురళీకృష్ణ
గాయనీ గాయకులు : శ్రీ కె.ఎస్.ఆర్. మూర్తి - శ్రీ చంద్రతేజ - శ్రీమతి వి. శశికళ స్వామి - నిఖిత గూడూరు

డా॥ ఆర్. ప్రభాకరరావు, ఐ.పి.ఎస్. (రి), అధ్యక్షులు, కిన్నెర
మద్దాళి రఘురామ్, కార్యదర్శి, కిన్నెర
డా॥ వాసా ప్రకాశ్ - జె. మీనాక్షి
వ్యవస్థాపకులు, వాసా ఫౌండేషన్


## అనతి కాలంలోనే రాష్ట్రం అద్భుత విజయాలను సాధించింది : హోం మంత్రి మహమూద్ అలీ



సంగారెడ్డి,జూన్ 02 (నేటి నిజం ప్రతినిధి) రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక బద్ధమైన విధానాలు ఆర్థిక క్రమశిక్షణతో అన్ని రంగాలలో ముందంజ లో ఉందని రాష్ట్ర హోం శాఖ మంత్రి మహమ్మద్ మహమూద్ అలీ పేర్కొన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఆయన సంగారెడ్డి కలెక్టరేట్ లోని అమర వీరుల స్థూపం వద్ద తెలంగాణ అమర వీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి, కలెక్టరేట్ ఆవరణలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి జిల్లాలో చేపట్టిన వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను క్లుప్తంగా వివరించారు. రైతుల్లో ఆత్మవిశ్వాసాన్ని కల్పిస్తూ అన్ని విధాల రైతు సంక్షేమానికి పాటుపడుతుందన్నారు. సంగారెడ్డి జిల్లా కు గోదావరి జలాలు తరలించాలని, జిల్లా మొత్తం సస్య శ్యామలం చేయడానికి, కాలంతో పనిలేకుండా పంటలకు సాగునీరు అందించేలా సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాలకు శ్రీకారం చుట్టింద న్నారు. ఈ రెండు ఎత్తిపోతల ద్వారా జిల్లాలో 3.84 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంద న్నారు. రైతు బంధు పథకం కింద గత 8 విడతలలో 21.76 లక్షల మంది రైతులకు రూ. 2,536 కోట్ల రూపాయలు అందజేశామన్నారు. తొమ్మిదవ విడత రైతుబంధు పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రైతు భీమా పథకం కింద 919 మంది రైతులకు రూ. 45.95 కోట్లు అందజేసినట్లు తెలిపారు. జిల్లాలో 1068 నీటి వనరులలో వంద శాతం సబ్సిడీపై 3.76 కోట్ల రూపాయల విలువ గల 3.58 కోట్ల చేప పిల్లల పెంపకం చేపట్టి, 16, 174 టన్నుల చేపల ఉత్పత్తిని సాధించినట్లు తెలిపారు. రబీ సీజన్లో 155 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసామన్నారు. దళిత బంధు పథకం కింద జిల్లాలో 444 మంది లబ్దిదారులను ఎంపిక చేసి, ఇప్పటివరకు 381 యూనిట్లను గ్రౌండింగ్ చేయడం జరిగిందన్నారు. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని వసతులతో సేవలందిస్తున్నామనీ, జిల్లాలో ఆరు బస్తీ దవాఖాన లను ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. మరో ఏడు బస్తీ దావఖానలు జిల్లాకు మంజూరైనట్లు తెలిపారు. ఈ సంవత్సరం ఇప్పటివరకు 12,847 కెసిఆర్ కిట్ల పంపిణీ చేశామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌక ర్యాలను కల్పిస్తూ, విద్యార్థులకు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్య అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం మన ఊరు మన బడి కార్యక్రమం చేపట్టిందన్నారు. అందులో భాగంగా జిల్లాలో 441 పాఠశాలలను ఎంపిక చేసామని, పాఠశాల పున ప్రారంభం నాటికి అన్ని హంగులతో సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. హరితహారం కార్యక్రమం లో రోడ్డుకిరువైపులా చెట్ల పెంపకం లో గత సంవత్సరం సంగారెడ్డి మున్సిపాలిటీ రాష్ట్రంలో ప్రథమస్థానంలో నిలిచిందని, అదేవిధంగా పిఎం స్వనిధి క్రింద వీధి వ్యాపారులకు మొదటి విడత రుణాల మం జూరులో జహీరాబాద్ మున్సిపాలిటీ దేశం లో ఆరవ స్థానం, సంగారెడ్డి మున్సిపాలిటీ 9వ స్థానంలో నిలిచిందని తెలిపారు. రెండవ విడత రుణాల మంజూరులో సంగారెడ్డి దేశంలో ఏడవ స్థానం జహీరా బాద్ 10వ స్థానంలో నిలిచినట్లు వెల్లడించారు. ఈ నెల 3 నుండి ప్రారంభమయ్యే ఐదో విడత పల్లె ప్రగతి కార్యక్రమాన్ని అందరి భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని కోరారు. 8వ విడత హరితహారాన్ని విజయవంతం చేసి జిల్లాను హరిత జిల్లాగా రూపొందించాలని కోరారు.

## సీఎం కేసీఆర్ పాలనలోనే రాష్ట్రం సుభిక్షం : పీయూసీ చైర్మన్ జీవన్ రెడ్డి

నిజామాబాద్, జూన్ 2: తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి జరిగి పేదల జీవితాలలో శాశ్వత వెలుగులు ప్రసారించాలంటే మళ్లీ కేసీఆరే సీఎం కావాలని పీయూసీ చైర్మన్, ఆర్మూర్ ఎమ్మెల్యే, ఆశన్నగారి జీవన్ రెడ్డి అన్నారు. నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం గుత్ప గ్రామంలో ప్రభుత్వం నిర్మించిన క్రీడా ప్రాంగణాన్ని గురువారం ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో క్రీడలకు అధిక ప్రాధాన్యతమిస్తూ క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీయ స్థాయికెదిగేలా తీర్చిదిద్దుతున్నదన్నారు. గ్రామస్థాయి నుంచే క్రీడాకారుల్లో ప్రతిభను వెలికి తీయడానికి, వివిధ క్రీడల్లో పాల్గొని యువత దేహ దారుఢ్యాన్ని పెంచుకొని సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ప్రభుత్వం ప్రతీ గ్రామంలో క్రీడా ప్రాంగణాలను నిర్మిస్తున్నదన్నారు. ఇప్పటి వరకు ఆర్మూర్ నియోజకవర్గంలోని మూడు మండలాలలో ఎనిమిది క్రీడా ప్రాంగణాలను ప్రారంభించినట్టు ఆయన పేర్కొన్నారు. స్వరాష్ట్ర సాధన 60ఏండ్ల కల. కేసీఆర్ గల్లీ నుంచి ఢిల్లీ వరకు 14 ఏండ్లు పోరాడారు. అంబేద్కర్ ను ఆదర్శంగా తీసుకుని సమీకరించి, బోధించి, పోరాటానికి దిగారన్నారు. సకలజనులను ఒకే తాటిపైకి తీసుకువచ్చారు. అంబేద్కర్ స్ఫూర్తితో, గాంధేయ మార్గంలో రాష్ట్రాన్ని సాధించారన్నారు.సీఎం కేసీఆర్ పాలనలోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఆయన ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మాస్త ప్రభాకర్, గ్రామ సర్పంచ్ చిన్నయ్య, టీఆర్ఎస్ పార్టీ మాక్లూర్ మండల అధ్యక్షుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాలలో ప్రజాప్రతినిధులు, అధికారులు భాగస్వాములై విజయంవంతం చేయాలి




మెదక్, జూన్ 2: (నేటినిజం ప్రతినిధి):ఈ నెల 3 నుండి పక్షం రోజుల పాటు చేపట్టనున్న పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాలలో ప్రజాప్రథినిధులు, అధికారులు భాగస్వాములై విజయంవంతం చేయవలసినదిగా జిల్లా పరిషద్ చైర్ పర్సన్ ర్యాకల హేమలత శేఖర్ గౌడ్ కోరారు. ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించిననాడే అసలైన ప్రగతి సాధించినట్లని రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి, హరితహారం కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రణాళికబద్ధంగా కృషి చేస్తున్నారని వారి ఆకాంక్ష మేరకు అందరు సమన్వయంతో పనిచేసి జిల్లాను రాష్ట్రంలో ముందుంచాలని పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్ లోని ఆడిటోరియంలో పల్లె ప్రగతి, పట్టణ ప్రగతిపై ప్రజాప్రతినిధులు, అధికారులతో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశానికి అధ్యక్షతవహిస్తు పల్లెప్రగతి ద్వారా నేడు పల్లెలలో గుణాత్మక మార్పులు వచ్చాయని అన్నారు. నిరంతరంగా ఈ ప్రక్రియ కొనసాగిననాడే పల్లెలు పచ్చదనం, పరిశుభ్రతతో వెల్లివిరుస్తాయాని ఈ కతృవులో జెడ్.పి.టి.సి.లు, మండల అధ్యక్షులు, ఏం.పి.టి.సిలు, సర్పంచులు, అధికారులు భాగస్వాములై సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కోరారు.

ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా రాష్ట్రముఖ్య మంత్రి పల్లె ప్రగతి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, ఇప్పటి వరకు జరిగిన నాలుగు విడతల పల్లె ప్రగతి కార్యక్రమంలో అందరి సమిష్టి కృషి ఫలితంగా దేశంలో పదికి పది ర్యాంకులు సాధించామని అన్నారు. కార్యక్రమాల అమలులో కొన్ని లోపాలుంటాయని, పాజిటివ్ దృక్పధంతో చూస్తే అన్ని సవ్యంగా కనపడ్తాయని అన్నారు. 2014 కు పూర్వం గ్రామాల స్థితి, నేడు పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా వైకుంఠధామాలు, డంప్ యార్డులు, నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటుతో పచ్చదనం, పరిశుభ్రతతో పరిఢవిల్లుతున్న గ్రామాల ప్రగతిని స్పష్టంగా గమనించాలన్నారు. పల్లెలు బాగున్నా పట్టణ ప్రగతిపై ముఖ్యమంత్రి అసంతృప్తిగా ఉన్నారని, ఈ సారి ఛాలెంజ్ గా తీసుకొని పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని విజయవంతం చేసి ఆ మచ్చ లేకుండా చూడాలని కోరారు. పల్లె ప్రగతి చేపట్టిన పనులకు ఎప్పటికప్పుడు రికార్డ్ చేసి పేమెంట్ జాప్యం లేకుండా చూడాలని పంచాయతీ రాజ్ అధికారులకు సూచించారు. సంబంధిత శాఖా అధికారుల ందురు కలిసిమెలిసి పనిచేసి జిల్లాకు మంచిపేరు తేవాలని కోరారు. జిల్లా కలెక్టర్ హరీష్ మాట్లాడుతూ ప్రతి పల్లెకు వైకుంఠధామం ,డంప్ యార్డ్, పల్లె వనాల ఏర్పాటు వల్ల నేడు గ్రామాలలో ఆహ్లాదకర వాతావరణం కనిపిస్తున్నదని అన్నారు. అల్లాదుర్గ్, టేక్మాల్ వంటి మండలాల్లో కార్యక్రమాలు మెరుగుపడవలసి ఉన్నదని ఆ దిశగా మండల ప్రత్యేకధికారులు, మండల పరిషద్ అధికారులు, ఏం.పి.ఓ.లు, పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలన్నారు. మండల వారీగా మంజూరైన పనులు, పూర్తైన ,ప్ర గతిలో ఉన్న పనుల సమగ్ర వివరాలు అందించవలసినదిగా అధికారులకు సూచించారు. ఈ నెల 3 నుండి 18 వరకు రోజు వారీగా చేపట్టవలసిన కార్యక్రమాలను అధికారులకు, ప్రజాప్రతినిధులకు వివరించారు. వైకుంఠధామం చుట్టూ రెండు వరుసలలో బయో ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని, నీటి సౌకర్యం ఉండేలా చూడాలని, అన్ని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, వైద్య కేంద్రాలు తదితర ప్రభుత్వ సంస్థలలో విరివిగా మొక్కలు నాటేలా చూడాలని అన్నారు. నిర్ణీత కాలవ్యవధి ప్రకారం మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయాలన్నారు. పల్లె ప్రగతి పెండింగ్ బిల్లులు రెండు రోజులలోగా క్లియర్ చేయవలసినదిగా ఏం.పి .డి.ఓ.లకు సూచించారు. ప్రతి మండలంలో స్థలాలను గుర్తించి బృహత్ పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేయాలని అన్నారు. పల్లె ప్రగతి పట్ల సంతృప్తి గా ఉన్న పట్టణ ప్రగతి బాగాలేదని, ఈ సారి కౌన్సిలర్ల భాగస్వామ్యం తో సిస్టమాటిక్ గా పనిచేయాలన్నారు. పట్టణాలలో ప్రతి దుకాణం ఎదుటి మొక్క నాటేలా దుకాణ యజమానులకు సూచించాలని, మల్టి లెవెల్ అవెన్యూ ప్లాంటేషన్ చేపట్టాలని అన్నారు. మునిసిపల్ ప్రాంతాలలో నర్సరీల సక్రమ నిర్వహణకు పంచాయతీ కార్యదర్శులను కేటాయించామని వారి సేవలను ఉపయోగించుకోవలసినదిగా మునిసిపల్ కమిషనర్ల సూచించారు. ప్రతి వార్డులో పట్టణ ప్రకృతి వనం ఏర్పాటు చేయాలి, అదేవిధంగా జూన్ 2 న ప్రతి మండలంలో 2, మునిసిపల్ వార్డులలో తెలంగాణా గ్రామీణ, పట్టణ క్రీడా ప్రాంగణాల ప్రారంభానికి సిద్ధం చేయాలనీ, వాటికీ 50 వేల విలువగల కిట్లు ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. కార్యక్రమం అనంతరం 5 ఉత్తమ, 5 బాగాలేని గ్రామపంచాయితీలను గుర్తించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, మునిసిపల్ చైర్మన్ చంద్రపాల్, జెడ్.పి . సీఈఓ శైలేష్, డిఆర్డిఓ శ్రీనివాస్, డిపిఓ తరుణ్ కుమార్, ఆర్డీఓలు సాయి రామ్, శ్యామ్ ప్రకాష్, వెంకట ఉపేందర్ రెడ్డి, మునిసిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేకాధికారులు, జెడ్.పి .టి.సి లు, ఏం.పి .పి .లు ఏం.పి .డి.ఓ.లు తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 3 నుండి చేపట్టనున్న బడిబాట కార్యక్రమాన్ని ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలి

### -సంబంధిత అధికారులకు సూచించిన అదనపు కలెక్టర్ వీరారెడ్డి



సంగారెడ్డి, జూన్ 2: (నేటినిజం ప్రతినిధి): బడిబాట సన్నాహక కార్యక్రమంలో భాగంగా బుధవారం కలెక్టరేట్ లోని ఆయన ఛాంబర్లో విద్య, సంక్షేమ, పరిశ్రమలు, కార్మిక తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడిబయటి పిల్లలను బడుల్లో చేర్చేందుకు ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు.

బడి ఈడు పిల్లలను గుర్తించి వారిని సమీప పాఠశాలలలో చేర్పించాలన్నారు. ఇటుక బట్టీలు, హోటల్లు,పరిశ్రమలు ,దుకాణాలలో పనుల్లో ఉన్న బడిఈడు పిల్లలను గుర్తించి పాఠశాలలకు తీసుకువచ్చేందుకు కార్మిక శాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. చిన్న పిల్లలతో పనిచేయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాఠశాలలకు వెళ్లే ఈడు పిల్లల వివరాలను ఎం ఈ ఓ లకు అందించాలన్నారు.

ఒకటో తరగతిలో చేరవలసిన విద్యార్థులను అంగన్వాడీ టీచర్లు సమీప పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ఐదు సంవత్సరాలు పూర్తయిన పిల్లల వివరాలను శిశు సంక్షేమ శాఖ అధికారులు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఇవ్వాలని సూచించారు.

5వ తరగతి, 7వ తరగతి వరకు చదివి తర్వాత తరగతుల్లో చేరాల్సిన విద్యార్థులు డ్రాప్ అవుట్ కాకుండా చూడాలన్నారు.

ఈ నెల 3 నుండి 10 వరకు డోర్ టు డోర్ సర్వే నిర్వహించి విద్యార్థుల ఎన్రోల్మెంట్ చేయాలన్నారు, ముఖ్యంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుండి 8వ తరగతి వరకు ఇంగ్లీష్ మీడియం ప్రారంభిస్తున్న ట్లు గ్రామ గ్రామాన ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్పోరేట్ కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పన తో పాటు ఇంగ్లీష్ మీడియంలో బోధన చేయనున్నట్లు తెలియజేయాలన్నారు.

అన్ని సంక్షేమ శాఖల వసతి గృహాల్లో ఉన్న విద్యార్థుల సంఖ్య, గత సంవత్సరం నమోదైన విద్యార్థులు, ఈ సంవత్సరం హాస్టల్ వారీగా ఎంతమంది విద్యార్థుల లక్ష్యం నిర్ణయించాలనీ, ఆ మేరకు ఈ నెల 10 వరకు నమోదు చేసుకోవాలని సూచించారు. జూన్ 11 నుండి 30 వరకు డ్రైవ్ గా చేపట్టాలని సూచించారు.

వసతి గృహాలలో పాఠశాలల ప్రారంభం కన్నా ముందే అవసరమైన మరమ్మతులను చేయించాలని, అన్ని మౌలిక వసతులు ఉండేలా చూసుకోవాలని సంక్షేమ అధికారులకు సూచించారు.

బడిబాట కార్యక్రమం పండుగ వాతావరణంలో జరగాలని, ఆయా శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ఈ సమావేశంలో ఆర్ డి ఓ నగేష్, విద్య, డి ఆర్ డి ఓ, బీసీ ,ఎస్సీ, ఎస్టీ ,మైనార్టీ, కార్మిక ,పరిశ్రమల శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## 39 మందికి పోలీస్ సేవా పతకాలు



కరీంనగర్ , జూన్ 2:విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసులకు తెలంగాణ ప్రభుత్వం సేవా పతకాలను ప్రకటించింది. 2019, 2020,2021 సంవత్సరానికి గాను రామగుండం కమిషనరేట్ లో 39 మందికి పోలీస్ సేవా పతకాలు వరించాయి. ఉత్తమ ప్రతిభ కనబర్చిన పోలీస్ అధికారులు, సిబ్బందికి సీపీ చంద్రశేఖర్ రెడ్డి పోలీస్ సేవా పతకాలను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ప్రజా రక్షణ, విధి నిర్వహణలో అసామాన్యమైన ప్రతిభను కనబర్చిన పోలీస్ సిబ్బందికి గుర్తింపునిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సేవా పతకాలను ఇస్తున్నాయన్నారు. విధి నిర్వహణలో ఉత్తమ పనితీరు, క్రమ శిక్షణ, కమిట్మెంట్ కనబర్చిన పోలీసు సిబ్బందికి పోలీస్ సేవా పతకాల ఇవ్వడం ద్వారా పోలీసుల్లో స్ఫూర్తిని నింపడంతో పాటు వారి పని తీరును మెరుగు పర్చవచ్చన్నారు. ప్రతీ ఒక్క పోలీస్ ఉద్యోగి కూడా రిటైర్ అయ్యేలోపు పతకాలు సాధించాలని, సేవా పతకాలను అందుకోవడం వల్ల సిబ్బందిలో ఉత్సాహాన్ని నింపడంతో పాటు తోటి వారికి ఆదర్శంగా ఉంటారన్నారు. సేవా పతకాలు అందుకున్న వారు ఇంతటితో ఆగకుండా రెట్టింపు ఉత్సాహంతో పని చేసి మరిన్ని పతకాలను సాధించాలన్నారు. అలాగే ఇతర సిబ్బంది కూడా పతకాలను అందుకున్న వారిని స్ఫూర్తిగా తీసుకొని తాము కూడా పతకాలను సాధించేందుకు కృషి చేయాలన్నారు.

## ఎన్నికల కోసమే బీజేపీ డ్రామాలు : కేంద్రంపై మంత్రి జగదీష్ రెడ్డి ఫైర్

సూర్యాపేట, జూన్ 2:తెలంగాణ విషయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం క్షుద్ర రాజకీయం చేస్తుంది. ఎన్నికల్లో లబ్ధిపొందాలనే ఢిల్లీలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు చేపడుతున్నదని మంత్రి జగదీష్ రెడ్డి బీజేపీపై నిప్పులు చెరిగారు. గురువారం ఆయన సూర్యాపేట క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు.

తల్లిని చంపి బిడ్డను బతికించారంటూ తెలంగాణ పై విషం కక్కిన ప్రధాని మోదీ ఇయ్యాల బిడ్డ బర్త్‌డే చేయడంలో ఆంతర్యం ఏంటని సూటిగా ప్రశ్నించారు. ఇన్నాళ్లకు బీజేపీ కి తెలంగాణ ఆవిర్భావ దినం గుర్తుకు రావడం తెలంగాణ ప్రజలకు ఆశ్చర్య కలిగిస్తుందన్నారు. తెలంగాణ పై నిత్యం విషం కక్కుతున్న మోదీ మంత్రి వర్గంలోని కీలక మంత్రి అమిత్ షా ఆవిర్భావ వేడుకల్లో పాల్గొనడాన్ని తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారు.విభజన హామీలు నెరవేర్చడంలో విఫలమైన బీజేపీ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం జరపడం ఒక డ్రామా అని మండిపడ్డారు. జాతీయ సమావేశాల్లో తెలంగాణకు ఎం చేసిందో స్పష్టం చెయ్యాలి. హైదరాబాద్ లో 24 గంటలు కరెంటు ,పుష్కలంగా నీళ్లు ఉండటం వల్లనే బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలు ఇక్కడ నిర్వహిస్తున్నారని మంత్రి స్పష్టం చేశారు.సమావేశాలకు వచ్చిన బీజేపీ పాలిత ముఖ్యమంత్రులు ఇక్కడ అభివృద్ధిని చూసి నేర్చుకొని పోతే మంచిదని హితవు పలికారు. ఎనిమిదేండ్ల క్రితం తెలంగాణాలో ఉన్న పరిస్థితులు ఇప్పుడు గుజరాత్ లో ఉన్నాయి. సీఎం కేసీఆర్ ఢిల్లీ కి వస్తున్నాడానే బీజేపీ అగ్ర నాయకత్వం మొత్తం ఉలిక్కిపడి హైదరాబాద్ వస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

2

"ఈ నవలలో ఎన్నో పాత్రలు. కొన్ని సజీవ పాత్రలు. మరికొన్ని మాజీ ప్రధాని పీ.వీ. రాసిన 'లోపలి మనిషి' నవలలోలాగ సజీవ పాత్రలను కలగా పులగం చేసిన చిత్రణ. కొన్ని ఊహాత్మక పాత్రలు. కొన్ని ఆదర్శ పాత్రలు. వీటిక్కూడా మూలరూపాలు... లేకపోలేదు" అని రచయిత బి.యస్. రాములు అన్నారు. ఆలోచింపజేసి, చైతన్య పరచే ఈ 'చూపు' నవలను ప్రతిరోజు నేటినిజం పాఠకులకోసం...

– సంపాదకులు.

# ప్రేమ






– బి.ఎస్.రాములు
సామాజిక తత్వవేత్త
తొలి ఛైర్మన్, బీసీ కమిషన్, తెలంగాణ రాష్ట్రం
సెల్: 8331966987

మానస సాయంత్రం ఇంటికి చేరడం ఆ రోజు కాస్త ఆలస్యమైంది. తల్లి మాధవి మానస కోసం ఇంకా రాలేదని ఎదురు చూస్తోంది. ఇప్పటికే వచ్చి వుంటుందని మానస ఫ్రెండ్స్ రమ్య, జయ మానస కోసం మానస ఇంటికి బయల్దేరారు.

మాధవి వారిని సాదరంగా ఆహ్వానించింది.

రామచంద్రయ్య, మాధవి దంపతులకు ఇద్దరు కొడుకుల తర్వాత ఎదురు చూడగా పుట్టిన గారాల బిడ్డ మానస. రమ్య ఎంఈవో సత్తయ్య, అనూరాధ లకు ప్రథమ సంతానం. ఇంటికి పెద్ద బిడ్డ కావడంతో రమ్య స్వభావంలో... ఇంటికి చిన్న బిడ్డ కావడంతో మానస స్వభావంలో... చాలా విషయాల్లో ఆ తేడా కనపడుతూ వుంటుంది. ఎంఈవో సత్తయ్య, అనూరాధలకు రమ్య తర్వాత కిరణ్ పుట్టాడు.

మానస, జయ ఇద్దరూ చిన్నప్పటి నుండి క్లాస్‌మేట్స్. జయ పెద్దింటి బిడ్డ. వాళ్ల కుటుంబం బంధువులు అందరూ బాగా వున్న వాళ్లు. ఆస్తి, అంతస్తుతో పాటు సామాజికంగా రాజకీయంగా అనేక రంగాల్లో రకరకాల స్థాయిలో వుంటూ ఆర్థికంగా రోజురోజుకూ బలపడుతున్న వాళు.. రమ్య ఎప్పటి నుంచో మానస ఇంట్లో సభ్యురాలిగా ప్రవర్తిస్తుంది.

రామచంద్రయ్య, ఎంఈవో సత్తయ్య, ఆర్‌డీవో వెంకటేశం, ప్రొఫెసర్ లక్ష్మీపతి, చిన్నప్పటి నుండి క్లాస్‌మేట్స్. యాభయ్యేళ్ళుగా వాళ్ళ స్నేహం విడదీయరానిది. తమ పిల్లలకు ఈడుజోడు కుదిరితే పెళ్ళిళ్ళు కుదుర్చు కోవాలని చిన్నప్పటి నుంచి అనుకుంటున్న మాట. పిల్లలకు కూడా

"ఏవో తోచినవన్నీ చెప్పనుంటివి. నిన్ను ఎంతమంది ప్రేమించిన్రో, ఎన్ని ప్రేమలేఖలు రాసిన్రో వాటన్నిటినీ ఎలా తిరస్కరించిన్రో, ఉన్నవీ లేనివీ అన్నీ కల్పించి చెప్పనుంటివి. సూపర్ సినిమాలాగా వుందని చప్పట్లు కొట్టెటోళ్లు" అంది రమ్య.

ఆ విషయం తెలుసు. అందుకని పిల్లలు ఆడా, మగ తేడా లేకుండా చాలా స్వేచ్ఛగా, స్నేహంగా, అరమరికలు లేకుండా చిన్నప్పటి నుంచి కలిసి వుంటారు. అలా మనోజ్, రమ్య కలిసి స్నేహం చేయడం ఎవరికీ అభ్యంతరం కాలేదు. పైగా రమ్య తల్లి అనూరాధ పరోక్షంగా ప్రోత్సహించింది, సమర్థించింది. చిన్నప్పటి నుండి అనుకున్న సంబంధం. మనోజ్, రమ్య పెళ్ళి అందరూ మనసులో ఖాయం చేసుకున్న సంబంధం.

మానస పెద్దన్నయ్య మనోజ్ హైదరాబాద్‌లో వుంటున్నాడు. అప్పు డప్పుడు ఇంటికి వస్తుంటాడు. పీజీ చేశాక ఏవో కోచింగ్‌లు, టెస్ట్‌లు, పిహెచ్‌డి ప్రవేశ పరీక్షలు రాస్తున్నాడు. చిన్నన్నయ్య మనోహర్ ఢిల్లీలో సివిల్స్‌కు ప్రిపేర్ అవుతూ కోచింగ్ తీసుకుంటున్నాడు. అందువల్ల ఇంట్లో మాధవి, మానస, రామచంద్రయ్య మాత్రమే వుంటున్నారు. పెద్ద ఇంట్లో ముగ్గురే వుండడం వల్ల రమ్య, జయ ఇక్కడికే వచ్చి కాలక్షేపం చేస్తుంటారు. మాధవికి కూడా వాళ్ళు వస్తేనే ఇల్లు నిండుగా వున్నట్టు అనిపిస్తుంది. వాళ్ళు రాకపోతే ఏదో వెలితి.

మానస ఇంకా రాలేదని కూర్చోమని మాధవి చెప్పడంతో వాళ్ళు ఒక నిమిషం కూర్చుని గార్డెన్ చూస్తాం ఆంటీ అని ఇంటిముందు గల గార్డెన్‌లోకి నడిచారు. మాధవి, మానసల ప్రేమ పుత్రిక ఆ గార్డెన్. ఎన్నో పూలచెట్లు. నీడనిచ్చే జామచెట్టు. బొప్పాయి. గులాబీలు, మల్లెలు, సన్నజాజి, గేటు మీద పారే తీగ పూలు, అప్పుడే విచ్చుకుంటున్న మందారాలు, నర్సరీ నుండి ప్రత్యేకంగా తీసుకొచ్చిన పూల కుండీలు, మొక్కలు, మధ్యలో మూడు స్టూల్లు. ఆ స్టూల్లపై జయ, రమ్య కూర్చుని ఆ పూల సవ్వడిని ఆస్వాదిస్తున్నారు.

మానస ఆలోచిస్తూనే ఇంటికి చేరింది.

"ఇవాళ లేటయిందేమే? మీ దోస్తులు వచ్చిండ్రు. గార్డెన్‌లో కూర్చున్నరు. చూడలేదా?" అంటూ పలకరించింది తల్లి మాధవి.

మానస బాత్రూంలోకి వెళ్ళి రిఫ్రెష్ అయి వాళ్ళతో కూర్చుంది. గార్డెన్‌లోంచి మమ్మీ అని మానస కేక వేసింది.

మమ్మీకి ఆ కేక అర్థం తెలుసు. చక్కని చిక్కని టీ ఒకటి వెంటనే కావాలని ఆ కేక అర్థం.

లైట్ టిఫిన్ తయారు చేస్తున్న మాధవి నవ్వుకుంది. "ఇది ఇంట్లోకి వస్తే చాలు ఇదే పని. పది మంది పెట్టు మాట్లాడుతునే వుంటది" అనుకుంది.

జయ, రమ్య, మానసల పలకరింపులు ముచ్చట్లు... అవీ ఇవీ అయ్యాక ఆ రోజు క్లాసులో, విద్యార్థులతో ఏం జరిగిందో గుసగుసగా చెప్పింది మానస.

"స్టూడెంట్ లైఫ్‌లో మీరు ఎవరినైనా ప్రేమించిన్రా! మిమ్మల్ని ఎవరైనా ప్రేమించిన్రా మేడమ్! అని క్లాసులో అడిగిండ్రే ఇవాళ" అంటూ రమ్య, జయ కళ్లల్లోకి సాభిప్రాయంగా, చిలిపిగా చూస్తూ నవ్వింది మానస.

రంగురంగుల పువ్వుల సువాసన్ని తెస్తూ చల్లగాలి కదిలింది. హాయిగా, నిండుగా ఆ పరిమళాల్ని ఆస్వాదించింది మానస.

"నిన్ను అంత ధైర్యంగా ఎవరడుగుతరే?" అంది రమ్య.

"రాజేశ్వరే అయి వుంటది" అంటూ అవునా అన్నట్టు మానసకేసి చూసింది జయ.

అవునన్నట్టు తల వూపింది మానస.

"మొత్తంగా జనరేషన్ మన కన్నా సూపర్ ఫాస్ట్ అయిపోయిందన్న మాట. ఇంటర్‌లోనే ప్రేమల గురించి అడుగుతున్నరా?" అంది జయ.

"అయితే ఏం చెప్పినవే?" ఆసక్తిగా అడిగింది రమ్య.

"ఏం చెపితే బాగుంటదే?" అంటూ ఎదురు ప్రశ్నించింది మానస.

"ఏవో తోచినవన్నీ చెప్పనుంటివి. నిన్ను ఎంతమంది ప్రేమించిన్రో, ఎన్ని ప్రేమలేఖలు రాసిన్రో వాటన్నిటినీ ఎలా తిరస్కరించిన్రో, ఉన్నవీ లేనివీ అన్నీ కల్పించి చెప్పనుంటివి. సూపర్ సినిమాలాగా వుందని చప్పట్లు కొట్టెటోళ్లు" అంది రమ్య.

"ఛ! స్టూడెంట్స్ ఆ ప్రశ్న అడుగుడే ఎక్కువ అంటే... ఇంకా దానికి జవాబియ్యాల్నా? మూడు తిట్టి నాలుగు కొసరు వేసేదుండె!" అంది జయ నవ్వుతూనే సీరియస్‌గా.

ముగ్గురు చిన్ననాటి మిత్రులు తమ మనస్సుల్లో బాల్యం నుండి అనేక జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. ఎక్కడెక్కడ ఎప్పుడు స్నేహమో, ప్రేమో లాంటి పదార్థం తమ జీవితంలోకి ఎప్పుడైనా ప్రవేశించిందా అని 'జ్ఞాపకాల జల్లెడ'తో గాలించుకున్నారు.

తనకు ఊహ తెలిసినప్పటి నుంచి తాను ఎవరినైనా ప్రేమించిందా? ఇద్దరు అన్నయ్యల తర్వాత పుట్టిన గారాల బిడ్డగా పెంచబడింది. మమ్మీకి తాను ఇప్పటికీ చిన్నపిల్లనే. కాస్త ఆకలిగా లేదు. తర్వాత తింటాలే అని అన్నప్పటికీ మమ్మీ బలవంతంగా తినవే అంటూ అన్నం కలిపి నోట్లో ముద్దలు పెడుతూ వుంటుంది. ఎటు తిరిగితే అటు ప్లేటు పట్టుకొని చిన్న పిల్లకు తినిపించినట్టు తినిపిస్తుంది. తనకు కూడా అప్పుడప్పుడు అలా మమ్మీ తినిపించాలని అనిపిస్తూ వుంటుంది.

స్కూల్లో గానీ, కాలేజిలో గానీ, ఓయూ క్యాంపస్‌లో గానీ తనకు ఎంతోమంది ఫ్రెండ్స్ అయ్యారు. కానీ తనకు ఎప్పుడైనా ప్రేమించే అవకాశం వచ్చిందా? వచ్చినా అలాంటి అవకాశాల్లో తాను ఏమైనా స్పందించిందా? తాను ప్రేమించకుండా తనను కట్టి పడేసింది ఎవరు? ఏమిటి? కుటుంబం కట్టుబాట్లు, క్రమశిక్షణ, భయం, సంకోచం, అలవాటైన సాంప్రదాయక సంస్కృతి.... ఇవన్నీ తనను బంధించాయా? ఇవాళ విద్యార్థినులు ప్రేమ గురించి ప్రశ్నించారంటే వాళ్ళు తన కన్నా కాస్త స్వేచ్ఛాయుత వాతావరణంలో పెరుగుతున్నట్టేనా!

డాడీ టీచర్‌గా, లెక్చరర్‌గా, ప్రిన్సిపాల్‌గా తాను పుట్టిన్నుంచి ఎప్పుడూ క్లాస్‌రూమ్‌లోలాగే ఇంట్లోనూ భయం భయంగా పెరుగుతూ వచ్చింది. స్వేచ్ఛలేని కట్టుబాట్లు, క్రమశిక్షణ తనకు ఎన్నో సార్లు అసహనం కలిగించేవి. ఇరిటేటివ్‌గా వుండేవి. అయినా తాను ఏం చేయలేకపోయింది. వాటిని తెంచుకోవాలన్న ఆవేశం ఒక్కోసారి బలంగా ఆవేశించేది. కానీ అంతలోనే ఆ తర్వాత ఏమవుతుందోనన్న భయం, సంకోచం...!

ప్రేమించే చొరవను చంపిన ఈ స్వేచ్ఛారహిత కుటుంబ వ్యవస్థను ఇలా ఎందుకు తయారు చేశారు? యూనివర్సిటీ క్యాంపస్‌లో వేణు ఎంతగా తనను ప్రేమించాడో? వేణు ఇపుడెక్కడున్నడో! ఏం చేస్తున్నడో పాపం! తన ప్రేమను వ్యక్తం చేసిన దానికన్నా ఎన్నో రెట్లు తన హృదయంలో నన్ను ప్రేమించాడు. కానీ తాను ఏమైనా జవాబు చెప్పగలిగిందా? ఒక్క మాటైనా ప్రేమపూరితంగా మాట్లాడగలిగిందా? అతనికి మాట్లాడే ఏకాంతాన్ని ఇవ్వకుండా ఎప్పుడూ స్నేహితురాళ్ల మధ్య కలిసి తిరుగుతూ అతన్ని ఎంతగా బాధపెట్టిందో! తనకు ఎన్ని సార్లు ప్రేమపూరితంగా మాట్లాడాలనిపించిందో! అయినా కనపడని తాళ్లు తనను ఎలా కట్టి పడేశాయో! ఇప్పుడనిపిస్తోంది... తనకు తానే బందీ అయిపోయిందేమో! ఈ సంస్కృతి, విలువలు, ఇంట్లోని క్రమశిక్షణ, అమ్మ తనపై నమ్మకంతో డాడీతో పోట్లాడి పీజీకి పంపించిన నమ్మకాన్ని వమ్ము చేయకూడదని తనకు తానే పరిమితులు విధించుకుంది. స్వేచ్ఛను వదులుకొని బందీ అయిపోయింది తాను.

తనకన్నా రమ్య, జయలు ఎంతో బెటర్. వీళ్ళకు కాస్త ధైర్యం ఎక్కువ. తాను మాత్రం ఎన్ని భావాలను తనలో తాను అణచుకుందో! వ్యక్తం చేస్తే ఏం జరుగుతుందోనన్న భయం. తనకు ఒక్కరైనా బాయ్‌ఫ్రెండ్ లేకపోవడం ఎంతో గొప్ప అనుకుంది ఇంతకాలం. కానీ అది ఎంత పెద్ద లోటు. రమ్య, జయలు బాయ్‌ఫ్రెండ్స్ అంటే ఎంతో ఉత్సాహం చూపిస్తుం టారు. అప్పు డప్పుడు నన్ను కూడా తప్పించుకొని వాళ్ళతో స్నేహాలు, ముచ్చట్లు, సినిమాలు చూడ్డం తాను గమనించకపోలేదు. ప్రేమించే చొరవ చంపిన ఈ స్వేచ్ఛారహిత కుటుంబాన్ని మానస మనసులో మొదటిసారిగా బాగా తిట్టుకుంది. తనను తాను బందించుకున్న తన వ్యక్తిత్వాన్ని కూడా తిట్టుకుంది.

ముగ్గురూ ప్రేమ గురించి ఒకవైపు చర్చిస్తూనే మరోవైపు మనసులో తమలో తాము ఆలోచించుకుం టున్నారు. అప్పుడే నవ్వుకుంటున్నారు. అప్పుడే సీరియస్‌గా తనలోకి తాను చూసుకుంటున్నారు.

ఆ సమయంలో తల్లి మాధవి అందరికీ లైట్ టిఫిన్ తీసుకొచ్చింది. అందరూ ఏందే మూగనోము పట్టిన్రు అని అంటూ మాధవి వారిని పలకరించి ట్రే మానసకి అందించి ఇంట్లోకి వెళ్ళిపోయింది. అమ్మ విన్నట్టు లేదు అని అందరూ హాయిగా ఊపిరి పీల్చుకున్నారు.

"ఆంటీ చాలా బాగా వంటలు చేస్తుంది. ఏది చేసినా చాలా టేస్టీగా వుంటుంది" అంటూ మెచ్చుకుంది రమ్య. టిఫిన్ చేస్తూ మళ్ళీ ఎవరి హృదయాల్లోకి వాళు ళ తరచి చూసుకున్నారు.

తన ప్రేమ వ్యవహారాలు మానసకు తెలుసు అని రమ్య మనసులో అనుకుంటోంది.

జయ కూడా తన విషయాలు మానసకు దాపరికం లేకుండా తెలుసని భావిస్తోంది. మానస తనకు వీళ్ళ ప్రేమలు ఏమీ చెప్పరు అని ఎప్పటికీ అనుమానిస్తోంది. అసలు విషయం తప్ప అబద్ధాలు ఎక్కువ చెబుతుంటారని మానసకు ఏదో అనుమానం. అందుకు మానసకు కూడా తగిన కారణాలే వున్నాయి. అంత దగ్గరి స్నేహితులైనా అన్నీ తెలిసినట్టే వుంటాయి. కొన్ని తెలియకుండానే వుండిపోతుంటాయి.

"మా గురించి నీకు అన్నీ తెలుసు. నువ్వు మాత్రం చెప్పవు. ఎవరిని ప్రేమించినవే? చెప్పవే" అంటూ రమ్య రెట్టించింది మానసని.

"మీ అన్నయ్య మనోజ్ ఎప్పుడొస్తున్నడే!" అంటూ అడిగింది జయ. రమ్య కూడా అదే ప్రశ్న అడగాలనుకుంది. మనోజ్ స్నేహాన్ని ఇద్దరూ ఇష్టపడుతుంటారు. ఎవరు ఎక్కువ ఇష్టపడుతుంటారో మానసకు ఎప్పుడూ అంతుపట్టని విషయం. ఒకరు ఒకసారి బయటపడతారు. మరొకరు మరోసారి బయటపడతారు.

"నేను ఎవర్ని ప్రేమించిన్నో... లేదో మీకు తెలుసు. ఎవరెవరు ప్రేమిస్తు న్నానని వెంట పడ్డరో కూడా మీకు తెలుసు. నువ్వనుకుంటున్నట్టు ఇవి అందరికీ చెప్పుకునేవి కావే. పైగా పెళ్ళి దాకా రాని ప్రేమలగురించి కనీసం కౌగిలించుకోలేని, ముద్దు పెట్టుకోలేని ప్రేమలగురించి చెప్పుకోవడం ఎందుకు? మగవాళ్లు చెప్పుకోవడం గొప్ప అనుకుంటరు. ఆడవాళ్ళం మనం చెప్పుకుంటే మనపట్ల అపార్థాలకు దారితీస్తుంది. శీలాన్ని శంకిస్తరు. వ్యక్తిత్వాన్ని కించపరుస్తరు. అందుకని మనం ఇతరుల ముందు ప్రేమను వ్యక్తం చేయలేం. ప్రేమించినా బాయ్స్ చెప్పుకున్నట్టుగా గర్ల్స్ చెప్పుకోలేరు. కాదానే? నువ్వు నీ ప్రేమను గురించి కనీసం మరొక బాయ్‌ఫ్రెండ్‌కైనా, మమ్మీకైనా ఇప్పటివరకు చెప్పగలిగినవా?" రమ్యకు చురక అంటించింది మానస.

మానస అలా ఎందుకంటుందో రమ్యకు తెలుసు. జయ కూడా కాస్త ఊహించింది. మనోజ్‌ను ప్రేమిస్తున్నానని రమ్య ఎప్పుడూ వాళ్ళ మమ్మీకి స్వయంగా చెప్పలేకపోయింది. మమ్మీయే చిన్నప్పటి నుండి వున్న చొరవ, స్నేహం చూసి ఏ వయస్సుకు ఆ ముచ్చట అని చూసీచూడనట్టు స్వేచ్ఛగా మాట్లాడుకునే అవకాశాలు ఇస్తూ వస్తోంది.

మానస ఎవరినీ ప్రేమించలేకపోయింది అనుకుంది జయ. రమ్య ప్రేమించకుండా వుండలేకపోయింది. జయ మరొక అడుగు ముందుకేసి ప్రేమకు, స్వేచ్ఛకు నోచుకుంది. తన ప్రేమను మూడో వ్యక్తికి తెలియకుండా స్వేచ్ఛగా వ్యక్తం చేస్తుంది. జయకు ఇంటా బయటా స్వేచ్ఛ కాస్త ఎక్కువ. కానీ గుంభనంగా వుంటుంది. ఏ విషయమూ చెప్పదు. బయటకు పొక్కదు. ఆ చాప్టర్‌ను పిన్నులు కొట్టి చదవకుండా చేస్తుంది జయ.

జయ తాను ఎవరిని ప్రేమించిందో, ఎవరెవరు తనను ప్రేమించానని వెంటపడ్డారో వున్నవీ, లేనివీ కల్పించి ఉత్సాహంగా కోతలు కోసింది. మానసకు అసలు విషయం తెలుసు మనోజ్ అన్నయ్యను ప్రేమిస్తోందని. కోతలు కోస్తున్నజయ ధైర్యానికి ఆశ్చర్య పోవడం రమ్య వంతయింది. జయ నిజమైన ప్రేమను మాత్రం చెప్పకుండా హృదయంలో దాచుకుంది. తాను నిజంగా ఎవరిని ప్రేమిస్తోందో అనే విషయం మాత్రం ఎన్నడూ పొరపాటున కూడా చెప్పదు. అలా చెప్పుకుంటే ప్రేమ బ్యాంకు నుండి చెక్కుతో ఎవరికో కొంత ఎమౌంటు రాసిచ్చినట్టు ఖర్చయిపోతుందని భావిస్తుంది. అయినా రమ్యకు, మానసకు జయ ఎవరిని మనసులో హృదయ పూర్వకంగా ప్రేమిస్తోందో కాస్త తెలుసు. అయితే స్వయంగా బయటపడుతుందేమోనని గుచ్చిగుచ్చి ప్రశ్నించారు. జయ అంతకన్నా గట్టి పిండం. అసలైన తన ప్రేమికుడి గురించి చెప్పనే లేదు. అలా చెప్పడం చాలా సంఘర్షణకు దారితీస్తుందని జయభయం. ఈ స్నేహాలు ఇలా కొనసాగవేమోనని సంకోచం.

"మీ స్టూడెంట్ లీడర్ రాజేశ్వరి మళ్లీ ఎప్పుడైనా ఈ ప్రశ్న వేస్తుందేమోనే! గడుసు పిండం. నిన్ను వదలదే! ఏం జవాబు చెప్పాలో నిర్ణయించుకోవే" అంది జయ నవ్వుతూ.

మానసకు ఆ విషయం తెలుసు. తప్పకుండా

"నేను ఎవర్ని ప్రేమించిన్నో... లేదో మీకు తెలుసు. ఎవరెవరు ప్రేమిస్తు న్నానని వెంట పడ్డరో కూడా మీకు తెలుసు. నువ్వనుకుంటున్నట్టు ఇవి అందరికీ చెప్పుకునేవి కావే.

ఎప్పుడో ఒకప్పుడు ఎవరో ఒకరు ఇలాంటి ప్రశ్న చొరవ తీసుకొని వేస్తారు. జవాబు ఏం చెప్పాలి! ఏం చెప్తే ఏం జరుగుతుందో!

మనస్సు నిజంగా తన హృదయంలోని భావాలను వ్యక్తం చేస్తుందా! సమాజం దేన్ని అంగీకరిస్తుందో, దేన్ని ఆమోదిస్తుందో దాన్ని మాత్రమే వ్యక్తం చేస్తూ మిగతావి తనలోనే దాచుకుంటుంది. మనస్సులో ఒక సెన్సార్ యంత్రాంగం నిరంతరం ఇలా పని చేస్తూ వుంటుంది. ఆ సెన్సార్ యంత్రాం గాన్ని మనస్సులో ప్రవేశ పెట్టింది ఎవరో? మమ్మీ, డాడీ, చుట్టూ వున్న సమాజమేనా? తనకు తానేనా? మనస్సు, అంతఃచ్చేతన ఒక గోడౌన్ వంటిది. వ్యక్తం చేయనీయకపోవడం వల్ల స్త్రీ హృదయం గోడౌన్‌లో బస్తాల్లాగా మూలుగుతూ వుంటుంది. దీన్నే మగవాళ్లు స్త్రీ హృదయం తెలుసుకోలేం అంటారు. వ్యక్తం చేయకుండా పరిమితులు విధించేది వాళ్లే. మళ్లీ స్త్రీ హృదయం అగాధం అని అనేది వాళ్లే.

స్వేచ్ఛగా భావాలను వ్యక్తం చేస్తే విపరీతార్థాలు తీస్తూ శీలాన్ని, వ్యక్తిత్వాన్ని కించపరుస్తూ నిందలు వేసే సమాజంలో ఏ భావాన్నైనా ఎలా వ్యక్తం చేయడం? భావాలే పుట్టకుండా అణగిపోతుంటాయి. పుట్టిన భావాలు మొగ్గలోనే వికసించకుండా ఆగిపోతుంటాయి. ఈ విలువలు, ఈ సంస్కృతి పరిమితిలో స్త్రీలు ఎలా ప్రేమ వ్యక్తం చేస్తారు? స్వేచ్ఛగా స్నేహాన్ని, ప్రేమను కొనసాగించడం ఎలా సాధ్యం? స్వేచ్ఛ లేని చోట ప్రేమ ఎలా వికసిస్తుంది? ప్రేమ అనేది స్వేచ్ఛయొక్క శిశువు. కట్టుబాట్లను తెంచుకోవాలనే యువ్వనోత్తేజం పెల్లుబుకినప్పుడు ప్రేమను వ్యక్తం చేయాలనిపిస్తుంది. కట్టుబాట్ల నిర్బంధంలోనూ వాటిని తెంచుకోవాలనే సాహసం, అశాంతి, నిర్బంధంలోనూ ప్రేమించాలని పిస్తుంది. అది స్వేచ్ఛను ప్రేమించడమో! ప్రేమను ప్రేమించడమో! తెలుసుకోవడం అంత సులభం కాదు.

మానస స్వయంగా తాను ఎవరినీ ప్రేమించలేకపోయింది. ప్రేమించలేక పోయిందా? ప్రేమను వ్యక్తం చేయలేకపోయిందా? ఆమె మనస్సు అనే గోడౌన్‌లో బస్తాలుగా పేరుకుపోయిన జ్ఞాపకాలను, అనుభవాలను ఒక్కొక్కటిగా కదిలిస్తే తప్ప తెలియదు.

అంతలో పంద్రాగస్టు గురించి కాలేజిలో జరిగిన విషయాల గురించి డాడీతో మానస చర్చించాలని గుర్తు చేసుకుంది. ముగ్గురూ కలిసి ప్రిన్సిపాల్ రామచంద్రయ్య గదిలోకి వెళ్ళారు. డాడీతో కాలేజిలోని విశేషాలను ఉత్సా హంగా చెబుతూ వచ్చింది. రాజేశ్వరి అడిగిన ప్రేమ విషయం తప్ప!

ప్రిన్సిపాల్ రామచంద్రయ్య కూడా మానస ఉత్సాహాన్ని చూస్తూ, గర్ల్స్ జూనియర్ కాలేజిలోని విద్యార్థినుల ఉత్సాహాన్ని విని సంతోష పడిపోయాడు. తమ డిగ్రీ కాలేజీలో అవే విశేషాలు ఎలా సాగాయో ఆ విశేషాలు ఆ ముగ్గురితో కలిసి పంచుకున్నాడు. వారితో స్నేహంగా, చొరవగా మాట్లాడాడు. తల్లి మాధవి అవన్నీ వింటూ తాను కూడా కాలేజి విద్యార్థిని అయిపోయినట్టు చిన్న పిల్లలా ఆనంద పడిపోయింది. కూతురు మానసలో పెరుగుతున్న ఆత్మవిశ్వాసం... తద్వారా ముఖంలో పెరుగుతున్న వెలుగు, తేజస్సు చూస్తుంటే మాధవి కడుపు నిండిపోయింది.

"మానసా! అయితే పిల్లలు అడిగిన దానికి ఏం చెపుతవు? విద్య ముఖ్యమా? ధనం ముఖ్యమా? కులం ముఖ్యమా? కండబలం ముఖ్యమా? సంఘ బలం ముఖ్యమా? అధికారం ముఖ్యమా? సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు ముఖ్యమా? ఏది ముఖ్యమని చెపుతావు?" ప్రసన్నంగా అడిగాడు రామచంద్రయ్య. మానస అవగాహన స్థాయి ఏమిటో తెలుసుకోవాలని తండ్రికి ఆసక్తిగా వుంది.

"అదే నాకు అర్థం కాలేదు నాన్నా! అందుకే నేను ఏమి చెప్పలేక తప్పించుకున్న. మీరు బాగా ఎదగాలని చెప్పి ముగించిన. మిమ్మల్ని అడిగి రేపు చెప్పవచ్చని అనుకున్న. అసలు ఏది ముఖ్యం నాన్నా! నాకైతే విద్య ముఖ్యం అనిపించినప్పటికీ విద్య కోసం డబ్బే ముఖ్యం అనిపిస్తున్నది. అధికారంతో అన్నీ సాధించవచ్చు అన్న మాట నిజమే కావచ్చు. కానీ స్టూడెంట్స్‌కు కూడా డబ్బుతోనే అధికారం వస్తుందని, అందువల్ల డబ్బే ముఖ్యమన్న విషయం అర్థమైపోయింది. అందువల్ల నాక్కూడా డబ్బే అన్నిటినీ నిర్ణయిస్తున్నదని అనిపిస్తున్నది. ఆర్థికమే అన్నిటికీ నిర్ణాయక అంశం... కాదంటరా నాన్నా...? నేను మెడిసిన్ చేయలేకపోవడానికి, డాక్టర్ కాలేకపోవడానికి డబ్బు లేకపోవడం ప్రధాన కారణం కాదా?"

"అవును అంకుల్! ఇది సెకండ్ టైమ్ లాంగ్‌టర్మ్ కోచింగ్‌కు పంపిస్తే ఖచ్చితంగా మెడిసిన్ సీటు సంపాదిస్తుండె. మీరే మొండిగా వద్దన్నరు. డాడీని అడిగితే మీకు తప్పకుండా ఇస్తుండే. మీరు ఇచ్చినప్పుడే తీసుకుంటుండె. డాడీకి నేను కూడా చెపుతుంటి. మీరే ఎంత చెప్పినా అడగనన్నరు." అంటూ జయ చొరవగా ప్రిన్సిపాల్ రామచంద్రయ్య మీద దాడి చేసింది.

ఆ మాటతో రామచంద్రయ్య కాస్త బాధపడిపోయాడు. మానస, జయ, రమ్య ఈ విషయంలో తనను జీవితంలో క్షమించేట్టు లేరు. కాస్త కష్టపడితే సెకండ్ టైమ్ లాంగ్‌టర్మ్ కోచింగ్‌కు పంపించడం అంత కష్టమైన విషయమేమీ కాదు. కానీ ఎందుకో నిర్లక్ష్యం చేశాడు...అప్పుడు ఏవో తాత్కాలిక ఇబ్బందుల వల్ల అలా చేశాడు గాని, నిజానికి అలా చేసి వుండాల్సింది కాదు. యాభైవేలు కావాలనుకుంటే అప్పు పుట్టేది కాదా? యాభైవేలు ఖర్చు పెడితే ఈ బాధ వుండేది కాదు. జయ అన్నట్టు వాళ్ళ డాడీ కాంట్రాక్టర్ లక్ష్మీకాంతం అడిగితే ఇచ్చే వాడే. అడగకపోయినా జయకు చెప్పినా తానే అడుకొచ్చి ఇచ్చేది. ఎందుకో అహం అడ్డం వచ్చింది. పిల్లల మంకుపట్ల ఎందుకో తనకు రేషం వచ్చింది.

మెడిసిన్ తప్ప చదవడానికి కోర్సుల్లేవా? జీవితంలో ఎన్నో కోర్సులు చదువుకొని ఎన్నో రకాలుగా ఎదిగిన వాళ్ళు వున్నారు. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న వాళ్ళల్లో చాలా మంది అడ్వకేట్లు. డాక్టర్లు కాదు, ఇంజనీర్లు కాదు. ఇలా ఏవేవో ఆదర్శాలు, ఆలోచన్లతో జీవితంలో పెద్ద పొరపాటే చేశాడు. అది కాలం సరిదిద్దలేని పొరపాటు. రామచంద్రయ్య పశ్చాత్తాపంతో తన కూతుర్లు వంటి పిల్లల ముందు తలవంచుకున్నాడు. మౌనంగా వుండిపోయాడు.

సెకండ్ టైమ్ లాంగ్‌టర్మ్ కోచింగ్‌కు పంపించినా సీటు రాకపోతే అప్పుడు మానసదే తప్పు తప్ప తన తప్పు లేకుండా పోయేది అనుకున్నాడు రామచంద్రయ్య. మనోజ్‌ను, మనోహర్‌ను ఇప్పుడు కోచింగ్‌లకు పంపిస్తు న్నాడు. వాళ్లకున్నంత పెద్ద నోరు, వాళ్లు మమ్మీతో పోట్లాట పెట్టుకొని, డాడీతో పోట్లాడి అంకుల్ రమ్య డాడీ అయిన ఎమ్ఈవో సత్తయ్యతో చెప్పించి, తిట్టించి డబ్బులు పుట్టించుకున్నారు. తమ ఇష్టం ప్రకారం చదువుకుం టున్నారు. పాపం ఆడపిల్ల మానస తనకు, తల్లికి ఎదురు చెప్పలేకపోయింది. అప్పుడు తనను బాగా తిట్టి ఎమ్ఈవో సత్తయ్య అంకుల్‌తో చెప్పించి వుంటే ఫీజు కట్టే వాడేమో. అయినా మానసకు జరిగిన నష్టం కొడుకులకు జరగొద్దని గుణపాఠంతోనే కదా మనోజ్‌కు, మనోహర్‌కు అడిగినంత డబ్బు ఇచ్చి చదువుకోపోరా అని పంపించింది. మానసకు ఇంటర్మీడియెట్ కాగానే తాను ఇలా ఆలోచించే అనుభవం కలగలేదు...

ఇప్పుడు కేవలం యాభై వేల కోసం జీవితమంతా మెడిసిన్ సీటు రాకపోవడం, మానస డాక్టర్ కాకపోవడం తన తప్పు అన్నట్టు బలిపశువు చేయబడుతున్నాడు. బదనాం చేయబడుతున్నాడు. అయినా రాష్ట్రంలో మెడిసిన్‌లో వున్నవి మూడు వేల సీట్లు. రాసేది అరవై వేలమంది. ఎంత బాగా రాసినా సీటు వచ్చేది మూడు వేలమందికే కదా! ఈ విషయం మానసకే కాదు అందరికీ తెలుసు. ఎంత బాగా రాసినా మూడు వేల మందికి తప్ప ఎక్కువ మందికి రావరి ఎవరికి చెప్పినా అర్థం కాదు... ఆ మూడు వేలల్లో ఒక సీటు సంపాదించుకునే దాన్ని అనే అనుకుంటారు తప్ప చదివినా వచ్చేది కాదేమోనని తల్లిదండ్రులను క్షమించడానికి మాత్రం సిద్ధంగా వుండరు. ఎదుటి వారిని బాధ్యులను చేయడం ఇదొక డిపెండెంట్ సైకాలజీ... ఇందులో ఏం ఆనందం వుంటుందో అర్థం కాదు...తన బాధ కడుపులోనే దాచుకొని వర్తమానంలోకి వచ్చి అన్నాడు రామచంద్రయ్య.

"జయా! నా వల్ల ఈ పొరపాటు జరిగింది. ఆ పొరపాటు సరిదిద్దుకునే క్రమంలోనే మనోజ్‌ను, మనోహర్‌ను హైదరాబాద్‌కు, ఢిల్లీకి వాళ్లడిగిన కోచింగ్‌లకి అప్పు చేసైనా పంపించిన కదా! మానస ఏ ఫీల్డ్‌లోనైనా ఎదుగుతుంది. ఇది ప్రొఫెసర్‌గా ఎదిగి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా కూడా కావచ్చు. దీని భవిష్యత్తు అంత గొప్పగా ఉంటుంది. డాక్టర్ అయితే ఏముంది?" అంటూ నవ్వాడు రామచంద్రయ్య.

"అంకుల్! డాక్టరైతే ఇది జిల్లా హాస్పటల్ సూపరింటెండెంట్ అయ్యేది. నిమ్స్‌కు డైరెక్టర్ అయ్యేది. అందులో మాత్రం ప్రమోషన్లు లేవా!" అంటూ నిలదీసింది జయ.

"అవును మామయ్యా! మీరు మానసకు ఈ విషయంలో అన్యాయం చేసిన్రు" అంటూ రమ్య కూడా గొంతు కలిపింది.

అలా కాసేపు చర్చ సాగిన తర్వాత చిన్నపిల్లలనుకున్న వాళ్లు కళ్లముందే ఎలా తమతో సమానంగా మాట్లాడే స్థాయికి ఎదుగుతారో చూస్తుంటే మాధవికి ముద్దు వచ్చింది. తన పిల్లలు తన భర్తను నిలదీస్తుంటే ఏదో తెలియని సంతోషం. తాను చేయలేని పని తన పిల్లలు చేస్తున్నందుకు కించిత్ గర్వం. మంచి పనైందని లోలోన భర్త పట్ల నవ్వు, ప్రేమ పూరిత అక్కసు కలిగింది మాధవికి.

"డాడీది తప్పులేదే. నేనే ఏ బాయిలో పడి ఛస్తానని మమ్మీ, డాడీని బ్లాక్‌మెయిల్ చేసే ధైర్యం చేయకపోవడం నాదే తప్పే" అంటూ నవ్వింది మానస.

"ఛస్తానని బెదిరించడం ఎందుకే..? మూడు రోజులు గాంధీలాగా నిరాహార దీక్ష చేపడితే అమ్మానాన్నలు దిగిరారా..?" అంది జయ.

అలా కాసేపటికి కాలేజీలో జరగాల్సిన వ్యాసరచన ఉపన్యాస పోటీలు, ఆటల పోటీల గురించి చర్చకు ఎజెండాకు తెచ్చింది మానస. రామచంద్రయ్య తిరిగి పెద్దతనం సాధించుకున్న వాడిలా గంభీరంగా మారిపోయాడు. అప్పుడు వారిని మళ్లీ చిన్న పిల్లల్లాగా చూపులు ప్రసరించాడు.

"మానసా! విద్య ముఖ్యమా? ధనం ముఖ్యమా? అధికారం ముఖ్యమా? సేవ ముఖ్యమా? అనే శీర్షికలు విడివిడిగా ఇస్తుంటం కానీ, నిజానికి ఇవన్నీ వేర్వేరు కావు. కానీ మనం స్కూల్లో, కాలేజీల్లో పోటీల కోసం ఏదో ఒక అంశం ఎన్నుకోమని చెప్పుకుంటూ వస్తున్నాం. కలం ప్రధానమా? కత్తి ప్రధానమా? అని ఒకసారి... విద్య ప్రధానమా? ధనం ప్రధానమా? అని ఒకసారి... సేవ ముఖ్యమా? అధికారం ముఖ్యమా? అని ఒకసారి... కులం ముఖ్యమా? గుణం ముఖ్యమా? అని ఒకసారి... సౌందర్యం ముఖ్యమా? సంస్కారం ముఖ్యమా? అని ఒకసారి... ప్రేమించి పెళ్లి చేసుకోవాలా? పెళ్లి చేసుకొని ప్రేమించాలా? అని ఒకసారి... స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు ముఖ్యమా? జీవన ప్రమాణాలు ముఖ్యమా? అని ఒకసారి... ఇలా పరస్పరం పోటీ పెట్టి విడగొడుతున్నం. నిజానికి అది పొరపాటేమో... ఏదో ఒకటి ప్రధానమని గుర్తించడంలో వాళ్ల జీవిత లక్ష్యాలు నిర్ణయించుకోవడంలో తోడ్పడతాయని మన ఉద్దేశ్యం. కానీ ఇవి వేర్వేరుగా లేవు కదా! అన్నీ కలిసే వుంటయి. పరస్పరం విడదీయడం వల్ల వాటి పరస్పర స్వభావాలు పూర్తిగా తెలియడం లేదు."

'అంకుల్ ఎప్పుడూ ఇంతే.. ఏ విషయం అడిగినా... క్లాస్ పీకుతారు...' అనుకుంటూ మనసులో నవ్వుకుంది జయ. రామచంద్రయ్య అదేమీ గమనించకుండా కాలేజీలో చెబుతున్నట్టుగా ధారావాహిక ప్రసంగాన్ని కొనసాగిస్తూనే పోయాడు.

ఉదా.కు విద్యతో ఉద్యోగం సంపాదించి డబ్బు సంపాదించుకోవచ్చు. అలాగే డబ్బుతో విద్య సంపాదించుకోవచ్చు. అధికారం సంపాదించుకోవచ్చు. కులాధికారంతో పెత్తనం చెలాయిస్తూ డబ్బు సంపాదించుకోవచ్చు. అధికారం సంపాదించుకోవచ్చు. ఇలా ఒక్కొక్క దాన్నుంచి మిగతా వాటిని కూడా సాధించుకోవచ్చు. కత్తి ద్వారా కలం బలాన్ని కూడా సాధించవచ్చు. కలం ద్వారా కత్తి బలాన్ని కూడా సాధించవచ్చు. ప్రేమించి పెళ్లి చేసుకోవచ్చు. పెళ్లి చేసుకొని ప్రేమించవచ్చు. అధికారంతో సేవ చేయవచ్చు. డబ్బు సంపాదించవచ్చు. అలాగే సేవతో అధికారం పొందవచ్చు. అమ్మ మనకు అన్ని సేవలు చేస్తూ మన మీద అధికారం చెలాయించడం లేదా? అమ్మకు వేరే అధికారం ఏముంది? మనందరికి సేవ చేయడమే మీ అమ్మకున్న అధికారం..."

మాధవికి ఆ మాటలు ఎంతో సంతోషం కలిగించాయి. ప్రిన్సిపాల్ రామచంద్రయ్య అప్పుడప్పుడు భార్యను ఇలా పరోక్షంగా ప్రశంసిస్తుంటాడు. ప్రత్యక్షంగా ప్రశంసించడానికి కాస్త సిగ్గు. ఆ తరం అలవాటు అది.

"మామయ్యా! మీరు ఒక ఎన్‌సైక్లోపీడియా ఎంత బాగా చెపిన్రు" అంటూ ప్రశంసించింది రమ్య.

గాలి రివ్వున వీస్తోంది. గార్డెన్ నిండా సువాసనలు. ఒక్కసారిగా ఆ సువాసనలు ఇంట్లోకి విసిరికొట్టాయి. ఎంత ఆహ్లాదంగా ఉందో... ఇల్లు. అటు గార్డెన్.. ఇటు ఇల్లు.. ఎంత స్వచ్ఛమైన గాలి.. ఎంత స్వచ్ఛమైన హృదయాలు.. ఆ గార్డెన్‌లో తాను, మనోజ్ కలుసుకున్నట్టుగా తలుచుకుంటూ పరవశించి పోయింది జయ.

తనకు అక్కరకు రాని జ్ఞానం ఎంత ఉంటే ఏం? ఇంట్లో డాడీ అవి ఎప్పుడైనా ఆచరించిండా! స్వేచ్ఛనిచ్చిండా? నేను ప్రేమించిన్నని చెప్పే స్వేచ్ఛను ఇచ్చిండా? ప్రేమించవచ్చు అనే భావనే భయపెట్టే విధంగా పెంచలేదా? తనకు ఇష్టమైన మెడిసిన్ చదువుకోనిచ్చిండా? ఎవరిది తప్పు? నాన్నదా? నాదా? నాలోని భయానిదా? ఆనాటి పరిస్థితులదా? అని మనసులో గొణుక్కుంది మానస.

పైకి మాత్రం "సరే అలాగే నాన్నా..." అంది మానస.

